



వార్త

ఆదివారం

20 ఏప్రిల్, 2025


# మానవ తప్పిదాలే మరణ శాసనాలు

# తారాతీరం



## ఎన్టీఆర్ కొత్త మూవీ షురూ

**ఎన్టీఆర్,** దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందనున్న విషయం విదితమే. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ అధికారికంగా ప్రారంభమైంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ కీలక అప్‌డేట్‌ను చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ సినిమా చిత్రీకరణలో ఏప్రిల్ 22 నుంచి ఎన్టిఆర్ పాల్గొననున్నట్లు తెలిసింది. కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు పేర్కొంది. ఇందులో భారీస్థాయిలో యాక్షన్ సీన్స్ ఉండనున్నాయని వెల్లడించింది. ఇటీవల కూడా ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను నిర్మాణ సంస్థ షేర్ చేసింది. భారతీయ సినిమా చరిత్రలో ఒక మార్క్‌ని క్రియేట్ చేసేలా ఇది ఉండనున్నట్లు తెలిపింది. ఈ పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ కనిపించబోతున్నట్లు సమాచారం. మలయాళ యువ హీరో టొవినో థామస్ కీలక పాత్రలో సందడి చేయనున్నట్లు తెలిసింది. ఈ చిత్రం వచ్చే యేడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిసింది.

## ధనుష్ 'ఇడ్లీ కడై' వాయిదా

**కోలీవుడ్** హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఇడ్లీ కడై'. నిత్యామేనన్ కథానాయిక, ఏప్రిల్ 10న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. ఈ సినిమా అక్టోబరు 1న విడుదల కానుంది. ప్రస్తుతం దీని చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో అరుణ్ విజయ్, ప్రకాశ్ రాజ్, షాలినీ పాండే కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా వాయిదా పడనుందంటూ వార్తలు రాగా నిర్మాత వాటిని ఖండించారు. అనుకున్న సమయానికే దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామని తెలిపారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో దీన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది.



ఆదివారం వార్త

20 ఏప్రిల్, 2025

## మంచి ముత్యాలు

ప్రతి ఉదయాన్నే దేవున్నిలా కోరుకో మంచితనం, మానవత మిత్రులు వీరిని నాతో వుంచు, అసూయ దురాశలే శత్రువులు వీరిని మానుంచి సంహరించు
అసూయ అగాధపు లోయ అని తెలుసుకో, మంచి వారితో మసులుకో.
క్షణికావేశం అనుక్షణం నరకాన్ని చూపే సన్నివేశం.

## కదంబం

'సంఘీ'భావం....5
మావోయిస్టులపై కేంద్రం యుద్ధం
కవర్ స్టోరీ..6
మానవ తప్పిదాలే మరణ శాసనాలు
సాహిత్యం.. 11
భాష, సంస్కృతి మేళవింపు
ఈ వారం కవిత్వం...12
యాజ్‌కుల్ యాజ్- కుకుంబర్ - 14
కథ..20
ప్రతి ఋతువు లోను
వసంత హరితం- 20
వాళ్లు తెరచిన పుస్తకం - 24
వాస్తు 25
కొండలలో కొలువైన కోనేటి రాయుడు- 26
సాక్షీ భూతాలు తొట్లకొండ చైత్రాలు 28
ఇంకా...
మొగ్గ
వారఫలం
వంటలు
వగైరా..వగైరా..

## సమాచారం

### సెలవుల్లో సరదాగా..

వేసవి సెలవులు మొదలైన నాటి నుంచి జరిగే ప్రతి విషయమూ పిల్లలకెంతో నచ్చుతుంది.



ఎన్నో మధుర అనుభూతుల్ని అందిస్తుంది. వాటిని పదిలంగా భద్రపర్చుకునే అవకాశం ఇవ్వండి. వారికి నచ్చేవన్నీ పొందుపరుస్తూ ఓ చక్కని స్క్రాప్ బుక్ తయారు చేసుకోనివ్వండి. కెమెరాలో నచ్చిన ప్రదేశాలూ, వస్తువులూ, వ్యక్తులను బంధించి.. వాటి కాపీలను అందులో జత చేస్తూ మనసు చెప్పినట్లు రాయనివ్వండి. ఎంత ఉత్సాహంగా చేస్తారో మీరే చూడొచ్చు. ఈ పని వారి సమయాన్ని చక్కగా సద్వినియోగం చేస్తుంది. చిన్నారుల ఊహలకూ, ఆలోచనలకూ ఊతం ఇస్తుంది. బంధాలనూ, చక్కగా వ్యక్తపరిచేందుకు తోడ్పడుతుంది.

### ఫోన్ శుభ్రం



ఫోన్ ఎక్కడ పడితే అక్కడ పెడుతుంటాం. దానిపైన ఎన్నో రకాల క్రిములు చేరి పోతుంటాయి కానీ ప్రత్యేకంగా శుభ్రం మాత్రం చేయం. పైగా ఆ ఫోన్ ఎప్పుడూ మన చేతుల్లోనే ఉంటుంది. తినేముందు చేతుల్ని కడుక్కుంటాం. కానీ వెంటనే ఫోన్ పట్టుకుంటాం. అలా చేయడం వల్ల చేతులు క్లీన్ చేసుకునీ ప్రయోజనం ఉండదు. అందుకే జపాన్‌లోని మెక్‌డొనాల్డ్స్ సంస్థ తమ అవుట్‌లెట్లలో తినడానికి వచ్చిన వారి ఫోన్‌లను కూడా శుభ్రం చేసి ఇస్తుంది. ఎలాగంటే. వాష్‌రూమ్‌లలో ఏఐతో పనిచేసే సింకులను అందుబాటులోకి తెచ్చింది. ఫోన్‌ను స్టెరిలైజ్ చేసే యంత్రం సింకులో భాగమై ఉంటుంది. అందులో ఫోన్‌ను ఉంచితే ఏటీఎం కార్డు మాదిరి లోపలకు వెళ్లిపోతుంది. ప్రత్యేక మైన శానిటైజర్ స్ప్రే అయి.. ఓ నిమిషం తరవాత ఫోన్‌మీద క్రిములు తొలగిపోయి బయటకు వస్తుంది. కస్టమర్ల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ సంస్థ తీసుకున్న నిర్ణయం బాగుంది కదూ!

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com






# కమలాలతో కళాఖండాలు



చల్లగా హాయ్ హాయ్ అనిపించాలంటే.. ఇంట్లో కమలాపండ్లు ఉండాల్సిందే. ఆ తొనలు తిని లేదా జ్యూస్ తాగి సేదతీరొచ్చు. ఆ సంగతలా ఉంచితే.. మనలో కాస్తంత కళాహృదయం ఉందనుకోండి. కమలాతొనలతో ఇలా కళాఖండాలు కూడా చేయొచ్చు.











## 'సంఘీ' భావం



# మావోయిస్టులపై కేంద్రం యుద్ధం

అటవీ ప్రాంతాల్లో ఆయుధం చేతపట్టి తీవ్రవాద భావాజాలాన్ని విశ్వసించి అందుకు అనుగుణంగా కొనసాగుతున్న మావోయిస్టులకు ప్రస్తుతం గడ్డుకాలం ఎదురైంది. మావోయిస్టుల ఏరివేతకు ఏకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మావోయిస్టుల ఉనికికే ముప్పుగా మారింది. ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్‌లో జరుగుతున్న మావోయిస్టుల కగార్ ఆపరేషన్‌లో వందలాది మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. 2026 మార్చి 31 నాటిని మావోయిస్ట్ రహిత ఛత్తీస్‌ఘడ్‌ను ఏర్పాటు చేస్తానని కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఇందుకు అనుగుణంగానే ఒక్కసారిగా మావోయిస్ట్ గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కగార్ ఆపరేషన్ పేరుతో వేలాది మంది పోలీసులు, సైనికులు దట్టమైన అటవీ ప్రాంతంలో చొచ్చుకు వెళ్లడం ప్రారంభించారు. మావోయిస్ట్ దళాలు కనిపిస్తే చాలు అత్యాధునికమైన ఆయుధాలతో వారిపై విరుచుకుపడుతు న్నారు. దీనితో దళాలకు దళాలే అంతరించిపోతున్నాయి. కేవలం గత మూడు నెలల వ్యవధిలో 125 మంది మావోయిస్టులు మృతి చెందారు. నాలుగు వందల మంది మావోయిస్టులు, మిలీషియా సభ్యులు పోలీసుల ముందు లొంగిపోయారు. గత సంవత్సర కాలంగా మూడు వందల మంది వరకు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. ఇప్పటి వరకు పోలీసులు అడుగుపెట్టని ప్రాంతాలలో సైతం పోలీసులు, సైనికులు గాలింపు చర్యలు చేపట్టారు. మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యులు అంబూజ్‌మడ్ ప్రాంతంలో ఉన్నారని పోలీసులు భావిస్తుండటంతో అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. వచ్చే మార్చిలోగా పూర్తిగా మావోయిస్ట్ లను తుడిచిపెట్టాలన్న లక్ష్యంతో కేంద్రం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. దీనికి అనుగుణంగా మిలట్రీ బెటాలియన్ లను అడవుల్లోకి పంపించడంతో పాటు ఆధునిక ఆయుధ సంపత్తిని సమకూర్చడం జరిగింది. ఆధునాతన డ్రోన్లలను రంగంలో దింపారు. ఈ డ్రోన్ల ఎలాంటి శబ్దం చేయకుండా ఆకాశమార్గం నుంచి మావోయిస్టుల కదలికలను గుర్తిస్తోంది. ఆధునిక కెమెరాలు అమర్చడంతో మావోయిస్ట్ దళంలో ఎంతమంది ఉన్నారు. వారి కదలికలు ఏ దిశకు ఉన్నాయన్న వివరాలు సైనిక బలగాలకు అందిస్తోంది. అదేవిధంగా థర్మల్ ఇమేజింగ్ కెమెరాలను ఉపయోగిస్తు న్నారు. ఈ కెమెరాలు చీకటిలో కూడా మావోయిస్టుల కదలికలను గుర్తిస్తాయి. వీటి సహాయంతో సుమారు మూడు, నాలుగు కిలోమీటర్ల వ్యవధిలో అటవీ ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలను గుర్తించే అవకాశం కలుగుతుంది. ఇది కాకుండా శాటిలైట్ చిత్రాలు కూడా మావోయిస్టులను గుర్తించే అవకాశాన్ని కలిగిస్తాయి. దీనితో మావోయిస్టుల కదలికలను పోలీసులు, సైనికులు సునాయసంగా గుర్తించి దాడులు నిర్వహిస్తు న్నారు. స్థానిక పోలీసులు, సైనికులతో పాటు ఆదివాసీలతో ఏర్పాటుచేసిన డిఆర్‌జీ బృందాలు కూడా మావోయస్టుల కదలికలను ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పోలీసులు క్యాంపులను నిర్వహిస్తున్నారు. 5 నుంచి 10 కిలోమీటర్ల వ్యవధిలో ఒక క్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు పెట్టి వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. గిరిజన గ్రామాల్లో మకాం వేయడం ద్వారా ఈ గ్రామాల నుంచి మావోయిస్టులకు ఎలాంటి సహకారం లేకుండా చేశారు. గతంలో మావోయిస్టులు ఈ గ్రామాల్లో కొంతకాలం బస చేసే వారు. అదేవిధంగా ఈ ప్రాంతాల నుంచి మావోయస్టులకు ఆహార ధాన్యాలు, ఇతర సహాయం అందేది. ప్రస్తుతం అలాంటి అవకాశం లేకుండా పోలీసు బలగాలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే అటవీ ప్రాంతంలో ఇప్పటివరకు పట్టు సాగిస్తూ వస్తున్న మావోయిస్టులు పోలీసుల వ్యూహాలకు ప్రతి వ్యూహాలు పన్నుతున్నారు. కీలక నేతలకు అంబూజ్ మడ్‌లో గట్టి భద్రత ఏర్పాటుచేయడంతో పాటు మైదాన ప్రాంతాల్లో కార్యకలాపాలు విస్తరింపచేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరోపక్క తాము శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటన కూడా చేశారు. అయితే ఆయుధాలు చేతపట్టి ఉద్యమాలు చేస్తే సహించేది లేదని స్వయంగా అమిత్‌షా ప్రకటించారు. ఇటీవల ఆయన ఛత్తీస్‌ఘడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు ఆయన గట్టి హెచ్చరికలు చేశారు. ఆయుధాలు వదిలి వస్తే తాము వారికి ఉపాధి కల్పిస్తామని, సాధారణ పౌరులుగా జీవించే అవకాశం కల్పిస్తామని అన్నారు. అయితే ఆయుధాలు వదలని మావోయిస్టులను మాత్రం క్షమించేది ఉండదని, చట్టప్రకారం వారిపై చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్‌లో జరుగుతున్న పరిస్థితులను సమీక్షిస్తే సైనికులు, పోలీసులదే పైచేయిగా ఉంది. మావోయిస్టుల వ్యూహాన్ని తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. తమను అటవీ ప్రాంతం నుంచి తొలగిస్తే కార్పొరేటర్లకు అడవులు అప్పగిస్తారని వారు ఆరోపిస్తున్నారు. ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో విలువైన ఖనిజ సంపద ఉందని, వనరులు ఉన్నాయని వీటిని కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్రపన్నుతోందని మావోయిస్టులు పేర్కొంటున్నారు. అడవులను కాపాడటంతో పాటు ఆదివాసీలకు తాము రక్షణగా ఉన్నామని, ఒక్కసారి తాము పక్కకు తప్పుకుంటే పరిస్థితులు దారుణంగా మారతాయని వారు హెచ్చరిస్తున్నారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# మానవ తప్పిదాలే మరణ శాసనాలు

పచ్చని పైర్లతో పంట పొలాలు కళకళలాడుతుంటే, పిల్ల తెమ్మెరలు పసిడి పంటలను స్పృశించి నాట్యమాడుతుంటే, ప్రకృతి వేయి వీణల సంగీత ధ్వనులను నలు దిక్కులకు ప్రతిధ్వనింప చేసిన అనుభూతి కలుగుతుంది. మనసు పులకరించి హాయి గొలుపుతుంది. శీతల సమీరం హృదిని తాకితే ఆనందం వెల్లువలా ప్రవహించింది.



కవర్ స్టోరీ

సుంకవల్లి సత్తిరాజు

దుమ్ము, ధూళిని పులుముకున్న గులాబీలు చిరుచినుకుల తాకిడిలో స్నానమాడి మిలమిలా మెరిసాయి. సుగంధ భరితమైన పూదోటలో విచ్చుకున్న పూలన్నీ గర్వంగా తలెత్తి తాండవ మాడాయి. గూడు వదలిన పక్షులన్నీ గుంపులుగా చేరి ఎగిరిగంతేసాయి. ఆనందంతో గగన విహారం చేసాయి. అలవోకగా నర్తించాయి. చిరుచినుకుల సవ్వడికి ఇంద్రధనస్సు గగనంలో సప్తవర్ణాల వింధ్యామరలా విచ్చుకుని, భూతలాన్ని కనువిందు చేసింది. అడవిలోని మయూరాలన్నీ ప్రకృతి శోభకు పులకరించి పురివిప్పి నాట్యమాడాయి. పచ్చని వనాలన్నీ పరవశించాయి.

గాలికి ఎగిరే పైర్లన్నీ ప్రకృతిని పరవశింప చేసాయి. స్వచ్ఛమైన ప్రాణవాయువు సకల జనుల పాలిట సంజీవనిలా మారింది. పచ్చదనపు హారంతో ప్రకృతి నిండుదనాన్ని సంతరించుకుంది. సమస్త జీవుల వైవిధ్య జీవన పోరాటం సృష్టికి అందం చేకూర్చింది. జలపాతాల హోరులో ప్రకృతి అందం పరిమళించింది. చిగురాకులపై పడ్డ మంచు తుంపరలను వెలుతురు స్పర్శించి మిలమిలా మెరిసే ముత్యాల్లా భ్రమింపచేసింది. చిరుగాలుల సవ్వడికి పంట పొలాల్లో పైర్లన్నీ అలవోకగా నర్తించాయి. చెట్ల కొమ్మల చాటు నుండి వెలుగు రేఖలు చీల్చుకుని వస్తుంటే, తెలియని అనుభూతులకు దారులు దగ్గరౌతున్న దృశ్యం కళ్ళ ముందు గోచరించింది. పక్షులన్నీ గగన విహారం చేస్తూ, కిలకిల రావాలు చేస్తున్నాయి. చేలగట్లన్నీ శ్రమ జీవుల పాదాల చప్పుళ్ళతో పులకరిస్తున్నాయి. పొలాలన్నీ కోత కొచ్చిన పైర్లతో నిండుదనం సంతరించుకున్నాయి. ధరణిపై తరువులు ఫలాలతో శోభిస్తున్నాయి. చెట్ల కొమ్మలపై వాలిన రంగురంగుల పక్షులు సృష్టి అందాన్ని ఇనుమడింప చేస్తున్నాయి. జలచరాలు నీటి చెలమలను ఆశ్రయించి ఆహారం కోసం పరితపిస్తున్నాయి.

పశువులు గుంపు గుంపులుగా బయలు దేరి, పచ్చిక బయళ్ళలో మేస్తూ క్షుద్బాధను తీర్చుకుంటున్నాయి. లేగ దూడల మెడలో కట్టిన మువ్వల శబ్దం పుడమికి శోభనిస్తూ ప్రతిధ్వనిస్తుంటే ప్రకృతి అందాలు పరవశింప చేస్తున్నాయి. జీవ సమూహంలో వైరుధ్యాలెన్నో వింత గొలుపుతున్నాయి. జీవులంతా వేర్వేరు దారులను అన్వేషిస్తూ తమ మనుగడను కొనసాగిస్తున్నాయి. జీవుల పోరాటమంతా ఆహారం కోసమే. జీవుల జీవన గమ్యం ఒకటే. జీవించే మార్గాలే భిన్నం. సమస్త సృష్టిలో కనిపించే వైరుధ్యమిదే. ఇదే జీవ వైవిధ్యం. ఇదే ప్రకృతిని కాపాడుతున్న విభిన్న జీవరాశుల వైవిధ్య భరిత జీవన సౌందర్యం. ప్రకృతి శోభను చూడలేని మానవ స్వార్థం కన్నెర్రచేసింది. పుడమిపై పచ్చని కాంతులను మాయం చేసింది! గులాబీల రేకులన్నీ నేలరాలాయి.

ముళ్ళేమో రాలిన ఆకులను చూసి వెక్కిరించాయి. పచ్చదనం పాడె కెక్కింది. ప్రకృతి బోసిపోయింది. కలుషితాల మధ్య కురూపిగా మారింది. నల్లని మేఘాలు ఆమ్లవర్షం కురిపించాయి. మానవుని ఇంటి కప్పు పర్యావరణం ఛిద్రమై విషవాయువులు యథేచ్ఛగా వెలువడుతున్నాయి. వేడెక్కిన భూతలం మనిషిని మసి చేస్తుంటే, సంద్రంలోని జలచరాలు అదృశ్యమైపోతున్నాయి. భూగర్భం నీరులేక నెరలు తీసింది. బంగరు నేలలు ఎడారులై విలపిస్తున్నాయి. ప్రకృతి వికృత రూపం ధరించి విలయతాండవ మాడుతున్నది. జలం లేని జగతి భీతిల్లింది. తిండి లేక జనావళి తల్లడిల్లింది. కలుషితాలతో మానవ లోకం కకావికలమైనది. రోగ గ్రస్తమైన పృథివిలోని జనజీవితాన్ని చూసి నిర్జీవ గ్రహాలు నవ్వుకున్నాయి. తమ సరసకు రాబోతున్న మరో గ్రహాన్ని చూసి రారామ్మని స్వాగతించాయి!! వర్తమానంలో పర్యావరణంపై జరుగుతున్న మానవ అరాచకం రాబోవు కాలంలో ప్రపంచంలో మానవ మనుగడను ప్రశ్నగా మార్చే దుర్దినాలకు దృశ్యరూప మిస్తున్నాయి. ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. ఇది కలలా మాత్రమే మిగలాలని ఆశిస్తూ పర్యావరణ పరిరక్షణకు ఉద్యమించాలి. మనసుకు హాయి గొలిపే దృశ్యాలు అగుపించినపుడు, ఆహ్లాదకరమైన వాతావరణం మన చుట్టూ ఏర్పడినప్పుడు ఆ అనుభూతిని వర్ణించడానికి అక్షరాలు సరిపోవు. ఈ ఆధునిక సాంకేతిక ప్రపంచంలో నిరంతరం ఉరుకులు పరుగులే. పొద్దు పొడిచింది మొదలు నిద్రపోయే వరకు మానసికంగా ఎన్నో వత్తిళ్ళకు సగటు మనిషి గురికావలసి వస్తున్నది. జానెడు పొట్ట కోసం జరిపే జీవన పోరాటంలో ఎన్నో కష్టాలు, కన్నీళ్లు వద్దన్నా వెంటాడుతూనే ఉంటాయి. పిలవని చుట్టాల్లా పలకరించి పోతూనే ఉంటాయి. మనసుపై బండెడు భారం మోపి, ప్రశాంతత లేకుండా చేస్తుంటాయి.

నిద్ర మాత్రమే మనసుకు ఔషధం లా పని చేస్తుంది. మెలుకువ వచ్చిన మరుక్షణం జనారణ్యంలో బ్రతుకు కోసం పోరాడవలసిందే. కన్నీటి సంద్రాన్ని ఈదాల్సిందే. కష్టాల భారాన్ని మోయాల్సిందే. శారీరకంగా, మానసికంగా అలసి పోయి, సేద తీరాలని విశ్రాంతి కోసం మనసు పరితపిస్తుంటే, హాయి గొలిపే వాతావరణం ధరిత్రిపై కరువైనది. కాలుష్యంతో



అవని ఆక్రందన చేస్తున్నది. గాలి గరళంలా మారింది. నీరు మాలిన్యమై రోగాలకు నిలయంగా మారింది. పెరిగిన ఉష్ణోగ్రతలతో ధరిత్రి కొలిమిలా మారుతున్నది. మానవ జాతికి కొరివి పెట్టి, కాటికి పంపడానికి ఎన్నో మానవ తప్పిదాలు కాచుకు కూర్చున్నాయి. ప్రకృతి నుదిటిపై దిద్దిన ఆకుపచ్చని తిలకం అదృశ్యమైపోతున్నది. కొండ కోనల్లో సహజసిద్ధంగా ఏర్పడిన అందచందాలు ఆవిరై పోతున్నాయి. అభయారణ్యాలు ఆపదలో చిక్కుకున్నాయి. జనారణ్యాలు జన సంద్రంతో కిక్కిరిసి పోతున్నాయి. పంట పొలాలు అంతరించి పోతున్నాయి. మట్టి వాసనతో గుభాళించే ప్రకృతిలో కాంక్రీటు కట్టడాలు నింగినంటుతున్నాయి. కాలుష్యపు రంగులను రంగరించుకుంటున్నాయి.

సహజత్వం నశించి జనావళి కృత్రిమత్వపు వెలుగులో మెరిసి పోవాలని తపిస్తూ ఊపిరాడని కాంక్రీటు భవనాల్లో పవళిస్తూ ఆరుబయట నిద్రించే మధుర క్షణాలను గతానికి అంకితమిచ్చింది. నెలవంకకు పరదా కప్పి, పండు వెన్నెల సోకని భవంతుల్లో జనావాసాలన్నీ ప్రకృతి శోభను కోల్పోయి, విద్యుత్ దీపాలతో కృత్రిమంగా మెరిసిపోతున్నాయి. కాలుష్య భారం మోయలేక నగరాలు విలవిల్లాడుతున్నాయి. నాగరికతకు నెలవైన నదులన్నీ కలుషితమైపోతున్నాయి.

అతివృష్టి, అనావృష్టి వంటి పరిస్థితులు అవనిపై తాండవిస్తున్నాయి. ఆకస్మిక వరదలతో కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన జననష్టం సంభవిస్తున్నది. సముద్రాలు పోటెత్తుతున్నాయి. తుఫానులతో తీర ప్రాంతాలు అతలాకుతలమై పోతున్నాయి. భూకంపాలతో కొన్ని దేశాలు బీభత్సాన్ని చవిచూస్తున్నాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతలతో భూతలం వేడెక్కి పోతున్నది. సముద్ర ఉపరితలం వేడెక్కి వాతావరణంలో హఠాత్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నదీ జలాలు, సముద్ర జలాలు ప్లాస్టిక్‌తో నిండిపోతున్నాయి. జలాల్లో నివసించే జీవజాలం మృత్యువాత పడుతున్నది. మానవ దుశ్చర్యలతో భూగ్రహం అనేక పరిణామాలకు లోనై, చివరికి నిర్జీవమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గత కాలం నాటి పర్యావరణం నేడు కానరాదు. ఒకప్పటి పచ్చటి ప్రకృతి నేడు విధ్వంసమై విలపిస్తున్నది. పర్యావరణానికి తూట్లు పడుతున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణం భూమిపై నశిస్తున్నది. నాటి కాలాన్ని స్ఫురణకు తెచ్చుకుని నేటి రోజులను తలచుకుంటే ఆవేదన కలగక మానదు. ఇలాంటి పరిస్థితులు ధరణిపై ఎందుకు ఏర్పడుతున్నాయి? ఎవరి పాపానికి ఫలితమిది? మానవ తప్పిదాలకు శాపమిది.

మానవ స్వార్థం జీవరాశుల మనుగడకు ముప్పుగా మారింది. సకల జీవరాశులు సంకటంలో పడ్డాయి. ప్రకృతి ప్రకోపించి ప్రళయనాట్యం చేస్తున్నది. పర్యావరణ విధ్వంస ఫలితాలు అత్యంత భయానకంగా మారబోతున్నాయి. వేగవంతమైన పారిశ్రామీకరణ, నగరీకరణ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయి. ఉపాధి అవకాశాల పేరుతో నగరాలకు వలస పోవడం వలన జనసాంద్రత పెరిగి నగరాలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. అభివృద్ధి పేరుతో పర్యావరణం ప్రమాదంలో పడింది. ప్రమాదకరమైన వాయువుల చేరిక వలన వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. ఇటీవల మ్యాన్మార్, థాయ్ లాండ్ దేశాల్లో సంభవించిన భూకంపం అత్యంత భయానకమైన ప్రకృతి విపత్తుగా పేర్కొంటున్నారు. క్రస్ట్, కోర్, మాంటిల్‌గా పిలవబడుతున్న భూమి పొరల్లో సంభవించే మార్పుల వలన, టెక్టానిక్ ప్లేట్లు ఢీకొనడం వలన భూకంపాలు ఏర్పడతాయి. బ్యాంకాక్‌లో భారీ విధ్వంసం జరిగింది. కళ్ళు తెరచి చూసేలోగా ఎన్నో ఆకాశహర్మ్యాలు నేలమట్టమయ్యాయి. రైల్వే, వైమానిక వ్యవస్థలు ఛిద్రమయ్యాయి. కమ్యూనికేషన్ వ్యవస్థలు కుప్పకూలి పోయాయి. ఇందుకు కారణం ఏమిటి? ఇది సహజంగా సంభవించిన పరిణామమైతే మనం చేసేదేమీ ఉండదు. ఇందులో మానవ తప్పిదాలు, పర్యావరణ సంబంధిత అంశాలు ఇమిడి ఉంటే ఆలోచించాలి. కొద్ది సంవత్సరాల క్రితం సిరియా, తుర్కియాల్లో సంభవించిన భూకంపం వలన సుమారు 50 వేలకు మందికి పైగా ప్రజలు మరణించారు. భూకంపం ప్రకృతి వైపరీత్యమే. అయితే మైనింగ్ పనుల వలన, భూగర్భాన్ని చీల్చి బోర్ వెల్స్, ఆనకట్టల నిర్మాణం చేయడం వలన, చెట్లను నరికి వేయడం వలన భూమి పొరల్లో ఘర్షణ ఏర్పడి భూకంపాలు సంభవిస్తున్నాయి. జపాన్ తరచూ భూకంపాలకు గురికావడం జరుగుతున్నది. గతంలో చైనా, ఆఫ్ఘనిస్తాన్,



నేపాల్ దేశాల్లో సంభవించిన భూకంపాలు పెను విధ్వంసం సృష్టించాయి. పర్యావరణ విధ్వంసం వలన భూకంపాలు ఏర్పడుతున్న మాట వాస్తవం. చమురు వెలికితీత, కర్బన వాయువుల విడుదల, అడవుల నరికివేత, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పర్యావరణ సమస్యల వలన భూతలం పైన, సముద్రాల్లోను అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడుతున్నాయని,

ఆహారపదార్థాలు విషపూరితమైపోతున్నాయి. గాలి కాలుష్యం, నీటి కాలుష్యంతో మానవ జీవితాలు సంకట స్థితి లోకి నెట్టబడుతున్నాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నాం. వివిధ రకాల పరిశ్రమల వలన వెల్లువెత్తుతున్న కలుషిత పదార్థాలతో గాలి కాలుష్యం, జల కాలుష్యం పెరిగింది. దీని కారణంగా వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. భూఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. సముద్ర జీవాలు నశించి పోతున్నాయి. భూ ఉపరితలంతో పాటు సముద్ర జలాలు కూడా వేడెక్కి పోతున్నాయి. ఆకస్మిక వాతావరణ మార్పులతో కుండపోత వర్షాలు పడి వరదలు ముంచెత్తుతున్నాయి. ఒకవైపు అతివృష్టి, మరో వైపు అనావృష్టి, ఒక వైపు వరదలు, మరోవైపు భూమికి నెరలు ఇదీ వర్తమానంలో అగుపిస్తున్న వైపరీత్యం. ఒక వైపు నీటి కోసం ఆరాటం మరో వైపు ముంపుతో జనం పోరాటం. మనకళ్ళెదుట అపారమైన జలసంపద అక్కరకు రాని చుట్టంలా వచ్చి సముద్రాలకు పయనమవుతున్నది. వరదనీటితో ఊళ్ళన్నీ మునిగిపోతున్నా, త్రాగడానికి నీరు మాత్రం లభ్యం కాని విచిత్ర పరిస్థితులు నెలకొంటున్నాయి.

మానవాధిపత్యం మానవ మనుగడను ప్రశ్నిస్తున్నది. ప్రకృతిలో పచ్చదనం హరించబడింది. కాలుష్యంతో, రసాయనాల వాడకంతో అనేక జీవరాశులు అంతర్ధానమై పోతున్నాయి. మరికొన్ని జీవరాశులు ఉనికి ప్రమాదంలో పడింది. ధూళి, దుర్గంధంతో, వ్యవసాయ వ్యర్థాల దహనంతో ఢిల్లీ వంటి నగరాల్లో గాలి కాలుష్యం విపరీతంగా పెరిగి పోయింది. శ్వాస కోస వ్యాధులు ప్రబలిపోతున్నాయి. మనం పీల్చే గాలి కాలుష్య భరితంగా మారింది. ప్రాణ వాయువు హరించుకుపోయి ప్రాణాలను తోడేస్తున్నది. కడివెడు గుమ్మడికాయ కత్తి పీటకు లోకువైనట్లు, కంటికి కనిపించని సూక్ష్మ జీవరాశులు మానవ జీవితాలను మరణ శయ్యపైకి నెడుతున్నాయి. పచ్చదనంతో, పాడి పంటలతో, పలు రకాల జీవరాశులతో, జల రాశులతో, సహజ వనరులతో ఆరోగ్యవంతంగా సాగవలసిన మానవ జీవితాలు పర్యావరణ విధ్వంసం వలన తలెత్తిన వాతావరణ మార్పులతో, ప్రకృతి విలయాలతో అతలాకుతలమై పోతున్నాయి. వాతావరణ హెచ్చరికలు గాని, పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం గాని ప్రకృతి విలయాలను నిరోధించలేక పోతున్నాయి. ప్రకృతి ప్రకోపిస్తే మానవ జీవితాలు తల్లక్రిందులవుతాయి. ప్రకృతి ప్రళయ గర్జన ముందు మానవ విజ్ఞానం, మేథస్సు మోకరిల్లక తప్పదని, జల ప్రళయం సంభవిస్తే కళ్ళు మూసి, తెరచేలోగా ఎన్నో బ్రతుకులు తెల్లారక తప్పవని ఇటీవల కేరళలోని వయనాడ్ జిల్లాలో సంభవించిన ప్రకృతి విలయ విధ్వంసం నిరూపిస్తున్నది. బుడమేరు వరదల వలన జనం విలవిల్లాడిపోయారు. ఆకస్మికంగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు అధిక వర్షాలకు దారితీసి, వరదలు సంభవిస్తున్నాయి. ఒకప్పుడు మనసును హత్తుకునే సహజమైన సోయగాలతో ప్రకృతి పులకరించి చిరు దరహాసం చేసింది. కొండల్లో, కోనల్లో, జలపాతాల హోరులో జనజీవన సౌందర్యం



వికసించి నర్తించింది. నదీ పరివాహకాల్లో నాగరికత విలసిల్లింది. పచ్చదనం ధరించిన ప్రకృతి ప్రేమామృతంలో సకల జీవకోటి తరించి మురిసింది. నింగిలోని తారకలు మిలమిలా మెరుస్తుంటే, నెలవంక నేలపై ప్రకృతి శోభను ద్విగుణీకృతం చేసింది. రాతిరి నిద్దుర మత్తులో జగతి నిశ్శబ్దాన్ని ఆశ్రయించగా, తూర్పున ఉదయ కాంతులు విచ్చుకుని, చెట్ల కొమ్మలపై గూడు కట్టుకుని విశ్రమిస్తున్న పక్షులను భానుని కిరణాలు మేల్కొలిపి నిద్దుర లేపుతుంటే, పొద్దు పొడుపు చీకటిని తరిమి, నిశ్శబ్దాన్ని ఛేదించి, జన జీవనాన్ని శ్రమైక జీవనం వైపు పురిగొల్పినట్టు నాటి పరిస్థితులుండేవి. పర్వతాలతో, సంద్రాలతో, నదీనదాలతో, అరణ్యాలతో జీవవైవిధ్యంతో, భౌగోళిక వైరుధ్యాలతో సకల జీవరాశుల మనుగడ భూతలంపై సజావుగా సాగుతున్న తరుణంలో మానవ స్వార్థం బుసలు కొట్టింది. పచ్చదనాన్ని సంహరించింది. అరణ్యాలు నశించాయి. కొండలు పిండి కాబడ్డాయి. కాంక్రీటు కట్టడాలు వెలిసాయి. భూగర్భాన్ని విచ్ఛిన్నం చేసి బంగారు బాతు లాంటి సంపదలను దోచేసి, ధరిత్రికి వ్యథ కలిగించాం. కొండలనే కాదు లోయలను కూడా స్వార్థానికి వినియోగించుకుంటున్నాం. సముద్రాలు, నదులన్నీ వ్యర్థాలతో నింపబడ్డాయి. మానవ జ్ఞానం ప్రకృతిని కాలదన్ని ఆధిపత్యం చెలాయించింది. ప్రకృతి సమతుల్యం దెబ్బతిన్నది. మానవ స్వార్థంతో ప్రకృతి క్షోభించింది. వికృతంగా మారింది. తప్పటడుగులను సరిచేసుకోవాలని పర్యావరణం హెచ్చరించింది. అవి తప్పటడుగులు కావు, తప్పుటడుగులని అవగతమైనది. ప్రకృతి ఆగ్రహిస్తున్నది. ప్రళయ గర్జన చేస్తున్నది. ప్రకృతి విలయంలో మానవ ప్రాణ దీపాలన్నీ క్షణాల్లో ఆరిపోతున్నాయి. సుగంధాలు అద్దుకున్న మానవదేహాలు శవాలగుట్టలై దుర్గంధాన్ని వ్యాపింప చేస్తున్నాయి.

## కేరళలోని వయనాడ్ జిల్లాలోను

ఉత్తరాఖండ్, హిమాచల ప్రదేశ్, మహారాష్ట్ర, సిక్కిం తదితర చోట్ల సంభవించిన వరదలు కూడా ప్రకృతి వైపరీత్యాల ఫలితమే. ఇవన్నీ మానవ తప్పిదాలు లిఖించిన మరణ శాసనాలే అని చెప్పక తప్పదు. ప్రపంచ జనాభా శరవేగంగా పెరుగుతున్నది. పెరిగిన జనాభా పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపెడుతున్నది. భారతదేశం చైనా జనాభాను అధిగమించి ప్రపంచంలో అతిపెద్ద జనాభా గల దేశంగా అవతరించింది. జనాభా పెరుగుదలతో పాటు పట్టణాలు, నగరాలు కూడా పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంత వాసులు మెరుగైన ఉపాధి కోసం నగరాలకు వలసపోతున్నారు. నగరాల్లో జనసాంద్రత పెరుగుతున్నది. హైదరాబాద్‌లో ప్రతీ చదరపు కిలోమీటర్‌కు సగటున 18,161 మంది జనాభా నివసిస్తున్నట్టు ఇటీవల వెలువడిన నివేదికలు పేర్కొన్నాయి. ఢిల్లీ నగరం కంటే హైదరాబాద్ అధిక జనసాంద్రత కలిగి ఉన్నట్టు తెలుస్తున్నది. భారతీయ నగరాల్లో మురికి వాడలు పెరిగిపోతున్నాయి. ఇదే సందర్భంలో ఆకాశ హర్మ్యాలు కూడా హద్దుదాటి వేగంగా రూపొందుతున్నాయి. శివారు ప్రాంతాలు నగరాల్లో కలిసి పోతున్నాయి. అభివృద్ధి పేరుతో వ్యవసాయ భూములు, చెరువులు, కుంటలు అదృశ్యమోతున్నాయి.

నగరాలన్నీ కాంక్రీటు అరణ్యాలుగా మారిపోతున్నాయి. చినుకు పడితే రోడ్లన్నీ సముద్రాల్లా మారిపోతున్నాయి. డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. వివిధ పరిశ్రమల వలన, అభివృద్ధి పేరుతో జరుగుతున్న కార్యక్రమాల వలన కాలుష్యం పెరిగి పోయి, పర్యావరణం దెబ్బతింటున్నది. నగర జీవనం కలుషిత కారకాలతో కకావికలమోతున్నది. ఇటీవల హైదరాబాద్ లో హైడ్రా పేరుతో నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడాలని ప్రయత్నాలు ప్రారంభమైనా, రాజకీయ కారణాలతో ఈ ప్రయత్నం వివాదాస్పదంగా మారింది. అలాగే పర్యావరణ పరిరక్షణ, బయోడైవర్సిటీ పేరుతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు తెలంగాణా ప్రభుత్వం అమ్మాలను కుంటున్న కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ ఉద్యమించారు. ఈ సమస్య రాజ కీయ కోణం సంతరించుకుని, సుప్రీంకోర్టు ద్వారా తాత్కా లికంగా ఆగింది. జీవ వైవిధ్యం పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుంది. జీవవైవిధ్యాన్ని కాపాడి, ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించాలి. అలాగే భూమిపై పెరుగుతున్న ఉష్ణోగ్రతలను కొంతమేరకైనా తగ్గించాలి. భూ ఉష్ణోగ్రతలను తగ్గించాలన్న పారిస్ ఒప్పందం నుంచి ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వం మరోసారి తప్పుకున్నది.ఇది అత్యంత దురదృష్టకరం. భారత దేశం లోను, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోను ఈ ఏడాది మార్చి ప్రారంభంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం గ్లోబల్ వార్మింగ్ తీవ్రతను ప్రస్ఫుటం చేస్తున్నది. వర్షాకాలంలో ఎంతగా వర్షాలు కురిసినా భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో పెరగక పోవడానికి కారణమేమిటి? బొట్టు బొట్టును పొదుపు చేద్దా మనే మాటలు హాస్యా స్పదంగా ఉంటున్నాయి. చెరువుల విధ్వంసం, కాంక్రీటు జనారణ్యాల పెరుగుదల, నీటిని ఒడిసి పట్టే ప్రణాళికలను గాలికి వదిలేయడం వలన పడిన ప్రతీ చినుకూ వృథాగా మారిపోతున్నది. అపారమైన జల సంపద కడలి గర్భంలో కలిసి పోతున్నది. భూములు నీరు లేక ఎడారులుగా మారిపోతున్నాయి. పర్యావరణ విధ్వంసం వలన వాతావరణం లో అనేక అవాంఛనీయమైన పరిణామాలు చోటు చేసుకుంటు న్నాయి. అతివృష్టి, అనావృష్టి వంటి పరిస్థితులు ఏర్పడుతు న్నాయి. అకాల వర్షాల వలన అనేక నష్టాలు సంభవిస్తున్నా యి. ఒక వైపు వర్షాలు,మరోవైపు విపరీతమైన ఎండలు, ఇంకోవైపు ఆకాశంలో నల్లని మేఘాలు, ఒకవైపు పొగ మంచు, మరోవైపు ఉదయాన్నే ఉక్కబోత... ఇలా విభిన్నమైన వాతా వరణ వైరుధ్యాలు భూతలంపై నెలకొంటున్నాయి. తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిలా భగ భగ మండుతున్నాయి. కొన్నేళ్ల క్రితం వరకు చెమట పట్టని వాతావరణంతో ఆహ్లాదకరంగా ఉండే భాగ్య నగరం విపరీతమైన ఉష్ణోగ్రతల ప్రభావంతో తల్లడిల్లి పోతున్నది. గతంలో బెంగుళూరు నగరం సాయం కాలానికి చల్లని వాతావరణంతో అలరించేది. వాతావరణంలో నెలకొంటున్న కాలుష్య ప్రభావం వలన, మానవ తప్పిదాల వలన సంభవిస్తున్న పరిణామాలు, ఉష్ణోగ్రతల్లో పెరుగుదల అంశాలను పరిగణలోకి తీసుకుని, ఇకనైనా భూగోళాన్ని సజీవంగా నిలుపు కోవాలనే భావన మనందరిలో కలగాలి. గ్రీన్ హౌస్ వాయువుల వలన భూగోళం వేడెక్కుతున్నది. కార్బన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, క్లోరో ఫ్లోరో కార్బన్లు, హైడ్రో కార్బన్లలు మిథేన్ తదితర వాయువులను గ్రీన్ హౌస్ వాయువులు అంటారు. పరిశ్రమల వలన రసాయనాల వ్యర్థాల వలన ప్లాస్టిక్ వినియోగం వలన భూగోళం పెను ముప్పు ఎదుర్కోవడం జరుగుతున్నది. భూతాపం వలన భారత్ వంటి దేశాలతో పాటు చైనా, బాంగ్లాదేశ్ వంటి పలు దేశాలు పలు సమస్యలను ఎదుర్కోబోతున్నాయి. న్యూయార్క్, లండన్ బ్యాంకాక్, ముంబై వంటి అనేక సముద్ర తీర నగరాలకు పెనుముప్పు ఏర్పడబోతున్నది. కోట్లాది సంవత్సరాల క్రితం మహా విస్ఫోటనం ఫలితంగా భూమి ఏర్పడిందనే వాదన ప్రచారంలో ఉంది. భూమి ముందు ఏర్పడిందా, ఇతర గ్రహాలు ముందు ఏర్పడ్డాయా అనే సందేహానికి ఈనాటికీ స్పష్టమైన సమాధానం దొరకలేదు. భూమికి సంబంధించిన ఎన్నో ప్రశ్న లను ఛేదించడానికి శాస్త్రవేత్తలు నిరంతరం తపిస్తున్నారు. భూమి ఏర్పడిన తర్వాత భూమిపై జీవించడానికి అనేక వనరులు ఏర్పడ్డాయి. దీనితో జీవజాలం ఏర్పడింది. మానవులతో పాటు వివిధ రకాల జీవరాశులు ఉద్భవించి మనుగడ సాగిస్తున్నాయి. ఇతర జీవరాశుల కంటే మానవ జాతి అత్యంత శక్తివంతమైనదిగా రూపాంతరం చెందింది. మానవుని తెలివితేటల నుంచి, ఆలోచనా జ్ఞానం నుంచి సైన్స్ ఆవిర్భవించింది. శాస్త్రీయ ఆలోచనల ఫలితంగా ఎన్నో మార్పులు భూగోళంపై సంభవిం చాయి. కాలక్రమంలో మానవ జాతిలో ఇతర జీవరాశులపై ఆధిక్యత, ఆధిపత్యం పెరిగింది. మానవుల్లో దూరదృష్టి, విచక్షణ నశించి, స్వార్థం పెరగడం వలన సువిశాలమైన భూగ్రహం ప్రమాదంలో పడింది. ఒకప్పుడు అందమైన ప్రకృతిలో, ఆరోగ్యకరమైన పర్యావరణంలో జీవించే పరిస్థి తులు నేడు తల్లక్రిందులైనాయి. అవసరం లేకపోయినా ఇబ్బడి ముబ్బడిగా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. పెరిగిన విలాసవంతమైన జీవన విధానం ప్రకృతిని విధ్వంసం చేస్తున్నది.పర్యావరణం ప్రమాదంలో పడుతున్నది. నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. అడవులు నశించిపోతున్నాయి.



పచ్చదనంతో వికసించిన ప్రకృతి నేడు దీనావస్థను చవిచూస్తున్నది. మానవ జీవన విధానంలో సహజసిద్ధమైన పద్ధతులు నశించి పోయాయి. విష వాయువుల వలన వాతావరణం కలుషితమై పోయింది. గాలి, నీరు, ఆహారం కలుషితంగా మారింది. మానవ అవసరాల కోసం సృష్టించు కున్న అనేక విధానాలు మానవ విధ్వంసానికి దారితీస్తున్నాయి. పెరిగిన అవసరాలు భూమిపై సహజసిద్ధమైన వాతావరణాన్ని విచ్ఛిన్నం చేసాయి.

పర్యావరణాన్ని మన చేజేతులా నాశనం చేస్తున్నాం. తత్ఫలితాన్ని కూడా అనుభవిస్తున్నాం. భౌగోళిక స్థితిగతులను బట్టి, పర్యావరణ సంబంధమైన మౌలిక పరిశీలన బట్టి ఏయే

కాలాల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో కూలం కషంగా అధ్యయనం చేసి కాల విభజన చేయడం జరిగింది. ఆయా మాసాల్లో వచ్చే ఋతువుల్లో వాతావరణ మార్పులు మన పెద్దలు చెప్పిన ప్రకారంగా తు.చ. తప్పకుండా జరిగేవి. ఖగోళ శాస్త్రాన్ని, భూగోళ పరిస్థితులను సమన్వయపరచి, తమ శాస్త్ర విజ్ఞానాన్ని రంగరించి ఏయే ఋతువుల్లో ఏయే మార్పులు సంభవిస్తాయి? ఏ కాలంలో భూతలంపై ఎలాంటి శీతోష్ణ స్థితులు సంతరించుకుంటాయో తెలిపే పంచాంగంలోని విషయాలు యథాతథంగా జరిగేవి. ఏయే మాసాల్లో ఎండలు ఉంటాయి? ఏ కాలంలో చలి పెరుగుతుంది? ఏయే కాలాల్లో వర్షాల ఆగమనం జరుగుతుంది? కార్తుల ప్రభావం ఎలా ఉంటుంది? అనే విషయాలపై మన పెద్దలు చెప్పిన విషయాలు వివిధ వర్గాల ప్రజలకు మార్గ నిర్దేశనం చేసేవి. అయితే నేడు ఆ పరిస్థితులు మారిపోయాయి. మనుషులు మారతారు. కాలాలు, ఋతువులు మారబోవని మన పెద్దలు చెప్పిన మాటలు వర్తమానంలో ఎదురు తిరిగాయి. మనుషులతో పాటుగా కాలాలు కూడా మారిపోయాయి. ఋతువుల ధర్మం మారిపోయింది. కార్తెలు కూడా తమ గమనాన్ని మార్చుకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయి. గత కాలం నాటి అంచనాలు తలక్రిందులౌతున్నాయి. ఒకప్పటి పచ్చని ప్రకృతి, పర్యావరణం మానవ దుష్కార్యాలతో విధ్వంసం కాబడింది. గలగల పారే సెలయేర్లు, నిండు కుండలా జలసిరులతో తులతూగే నదీనదాలు, ఎత్తైనకొండలు, అరణ్యాలు, అరణ్యాల్లో జీవించే పశుపక్ష్యాదులు, అపారమైన భూగర్భ జల సంపద, భూగర్భంలో నిక్షిప్తమైన అమూల్యమైన పలు వనరులు, సకల జీవరాశుల ఉనికికి ఆవాసంగా మారిన పుడమి ప్రకృతి ప్రసాదించిన అందచందాలతో సృష్టికి అలంకారంలా భాసిస్తూ, అలరాడిన నాటి సోయగం నేడు అదృశ్యమై, నిస్సారమై ఎడారిని తలపిస్తున్నది. కొండల్లో, కోనల్లో, అడవుల్లో ఎక్కడ చూసినా ప్రకృతి సోయగం గుభాళించేది, ఎన్నో రకాల వృక్షాలు ప్రకృతిలో పచ్చదనాన్ని సృష్టికి కానుకగా అందించేవి. అలాంటి పచ్చదనం నేడు కనుమరుగైనది. సంగీత రస ఝరిలా పృథ్వీపై ప్రవహించే జల రాశులు మటుమాయమై పోతున్నాయి. భూగర్భ వనరులన్నీ తరిగిపోతూ నిండు గర్భిణిలా అగుపించే భూమాత శోకదేవతలా తల్లడిల్లి పోతున్నది. అరణ్యాలు అంతరించి పోతున్నాయి. కోటాను కోట్ల జీవ రాశులకు నిలయమైన అవనిపై మానవాధిపత్యం పెరిగింది. ప్రకృతిలో పచ్చదనం హరించుకు పోతున్నది. పుడమి బోసిపోతున్నది. ఎన్నో జీవరాశులు అంతరించిపోయాయి. మరెన్నో జీవజాతుల ఉనికి ప్రశ్నార్థకమై పోయింది. పర్యావరణం ప్రమాదంలో పడింది. మానవ స్వార్థం మానవాళికే మృత్యుగీతం ఆలపించే తరుణం ఆసన్నమైనది. పచ్చని ప్రకృతి ఒడిలో పసిపిల్లల వలే ఆనందంతో జీవించే ఆరోగ్యవంతమైన వాతావరణం భువిపై కనుమరుగై పోతుంటే, సహజత్వంలో ఉన్న మాధుర్యాన్ని మరచి, కృత్రిమంగా జీవించే కాలాన్ని ఖరీదు పెట్టి కొనుక్కునే చేటు కాలం దాపురించింది. పండు వెన్నెల్లో పరవశించే కాలం పరిసమాప్తమై, కాంక్రీటు అరణ్యాల పరదాల్లో నివసిస్తున్నాం. జీవరాశుల మనుగడకు గ్రీన్ హౌస్ వాయువులు ఎంత ముఖ్యమో, వీటి ప్రభావం అధికమైతే అంతే ప్రమాదం. గ్రీన్ హౌస్ వాయువులు లేకపోతే భూతల ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీకి పడిపోతాయి. కాబట్టి ఈ వాయువులు తగు పరిమాణంలో ఉండాలి. కాలుష్యాన్ని పెంచే ఇంధనాల వాడకం విపరీతంగా పెరిగిపోతున్నది. మానవ దుశ్చర్యల వలన ప్రకృతి ప్రకోపిస్తున్నది. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నది. కలుషిత కారకాలతో, అవాంఛనీయ వాతావరణ మార్పులతో ధరిత్రిలో జీవజాలంనశించి, భూగ్రహం నిర్జీవంగా మారే ప్రమాదం ఏర్పడింది. పచ్చదనాన్ని పెంపొందించి, జీవవైవిధ్యాన్ని కాపాడి, ప్రకృతిని పరిరక్షించి, "ధరిత్రి" ని కాపాడుకోవడానికి గల అన్ని అవకాశాలను పరిశీలించాలి. ప్రకృతిలో పచ్చదనానికి ప్రాధాన్యత నివ్వాలి. మొక్కలను విరివిగా పెంచాలి. కాలుష్య రహిత ప్రపంచానికి పచ్చదనమేమార్గం. పచ్చదనాన్ని కాపాడితే వాతావరణంలో సంభవించే అవాంఛనీయ మార్పులను అరికట్టవచ్చు. కాలుష్య భూతాన్ని తరిమికొట్టాలంటే పచ్చదనమే ఏకైక మార్గం. సకల దుర్గంధాలతో మిళితమైన ప్రస్తుత వాతావరణాన్ని మార్చగలమా? మానవ తప్పిదాలను సరిదిద్దుకోగలమా? సహజ జీవన శైలిని అలవరచుకోవడం సాధ్యమేనా? పర్యావరణాన్ని పరిరక్షించుకోలేక పోతే జరిగే అనర్థాల గురించి ప్రపంచ దేశాలను అప్రమత్తం చేయాలి. క్లీన్ ఎనర్జీని వినియోగించాలి. "తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు...చేరి మూర్ఖుల మనసు రంజింప రాదు" అనే భర్తృహరి సుభాషితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విషయంలో నూటికి నూరుశాతం నిజం. ప్రపంచ దేశాలన్నీ కాలుష్యంతో అతలాకుతలమై పోతుంటే, కాలుష్యానికి కారణమైన కర్బన ఉద్గారాలను తగ్గించడంలో కృషిచేయకపోగా, భూగర్భ ఇంధన వనరుల తవ్వకం ముమ్మరం చేయాలనుకోవడం తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అన్న చందంగా మూర్ఖ ధోరణి ప్రదర్శించడం అభ్యంతరకరం, అనుచితం. ఇప్పటికే మానవ తప్పిదాలతో ఏర్పడుతున్న పర్యావరణ సంబంధిత విపత్కర పరిణామాలను చవిచూస్తున్నాం. ప్రకృతి ఎన్నో ప్రశ్నలను మానవాళి ముందుంచింది. ప్రకృతి సంధించిన ప్రశ్నలకు సమాధానాలు కూడా ప్రకృతిలోనే లభ్యమవుతాయి. మనిషి సృష్టించిన సమస్యలకు పరిష్కారం కూడా మనిషి చేతుల్లోనే ఉంది. మానవ స్వార్థం ప్రకృతిని పరిహసించింది. పలు సమస్యలకు కారణమైనది. సమస్యలకు విరుగుడు కూడా మనమే కనిపెట్టాలి. ఇంధనం లేనిదే మానవ జీవితం సాగదు. అలాంటి ఇంధనాల విచ్చలవిడి వాడకం వలన పర్యావరణం దెబ్బతింటున్నది. ప్రజలు ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలకు, వాతావరణ మార్పులకు శిలాజ ఇంధనాల వినియోగమే చాలా వరకు కారణం. సాంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో క్లీన్ ఎనర్జీని ఉపయోగించడమే పర్యావరణ సంబంధిత సమస్యలకు విరుగుడు. వాతావరణ మార్పులపై ప్రపంచ దేశాలు బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నాయని చెప్పడానికి శిలాజ ఇంధనాల వాడకాన్ని కనీస స్థాయికి తగ్గించకపోవడమే ఒక ఉదాహరణ. పర్యావరణ విధ్వంసాన్ని నిలుపుదల చేసి, కాలుష్యాన్ని అరికట్టి భావితరాలను కాపాడాలి. మన చుట్టూ ఆవరించబడిన పర్యావరణం సకల జీవరాశుల భద్రతకు భరోసా. అలాంటి భద్రతను విచ్ఛిన్నం చేసి, జీవరాశుల ఉనికిని భూగ్రహంపై లేకుండా చేయడం మనం కూర్చున్న చెట్టు కొమ్మను మనమే నరుక్కోవడం వంటిది. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ పాటుపడాలి. సకల జీవజాతులను సంరక్షించాలి. అప్పుడే మానవ మనుగడ పదికాలాల పాటు భూమిపై పదిలంగా ఉంటుంది. ✦



**తెలుగు సాహిత్యంపై బెంగాలీ సాహిత్య ప్రభావం 1905లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడినప్పటి నుంచి సుమారుగా ముప్పై సంవత్సరాల కాలం కొనసాగింది. అలాగే అనువాదాలు కూడా వచ్చాయి. 1907లో ఒ.వై.దొరస్వామి అయ్యర్ 'ఆనందమఠ్' 'కపాల కుండల', 1908లో నేదునూరి గంగాధరరావు 'సుగుణవతి' పరిణయం, 1909లో కనకవల్లి భాస్కరరావు ప్రఫుల్ల, 1910లో చాగంటి శేషయ్య రాధారాణి, 1912లో వద్దనూరి గోపాలరావు సుందరి, కొత్తపల్లి సూర్యారావు కమలపాలిక తెలుగులోకి అనువదించారు.**

# భాష, సంస్కృతి మేళవింపు

**జయసూర్య**

అప్పటికే కందుకూరి వీరేశలింగం కేశవ్ చంద్రసేన్ గ్రంథాలు చదివి ప్రభావితుల య్యారు. గురజాడ, గిడుగు తదితరులు బెంగాలీ రచయితల ముందు చూపుతో, తెలుగును వ్యవహార భాషగా సంస్కరించు కోవాలనే ఆలోచనల కార్యాచరణ ఆరంభించారు. వెంకట పార్వతీశ కవులు బంకించంద్రుని నవాబునందిని, యుగలాంగులీయం, కృష్ణకాంతుని వీలునామా వంటివి అనువదించారు. పంచ కౌడిదేవ్ అపరాధ పరిశోధక నవల వాడే వీడుగా ప్రవేశించింది. పిలకా గణపతి శాస్త్రి, బొందల పాటి శివరామకృష్ణ శరత్ నవలలు అనువదించారు. విజ్ఞానచంద్రిక, వేగుచుక్క, హితకారిణీ సమాజం, ఆంధ్ర ప్రచారిణి, సరస్వతి గ్రంథమాలలు తమ ప్రచురణల ద్వారా అనువాదాల్ని ప్రోత్సహించాయి. అనువాదాలే కాదు. బెంగాలీ నవలలలో పాత్రల ప్రభావంతో చిలకమర్తివారి 'హేమలత', దుగ్గిరాల రామచంద్రయ్య సచ్ఛాస్త్రి 'ప్రఫుల్ల', రవీంద్రుని గీతాంజలి అప్పట్లో ఎంతో మంది అనువదించారు. యువ తెలుగు కవులు శాంతినికేతన్ బాట పట్టారు. రవీంద్రుని ప్రభావంతో భావకవిత్వం వెల్లివిరిసింది.

రాయప్రోలు సుబ్బారావు లలిత, స్వప్నకుమారం, జడకుచ్చులు, తృణకంకణం, కష్ట కమల బెంగాలీ సాహిత్య ప్రభావం, ముఖ్యంగా రవీంద్రుని ప్రభావంతో రాసారు. అబ్బూరి రచనలు ఊహాగానం, మల్లికాంబ, దేవులపల్లి కృష్ణశాస్త్రి ఊర్వశి, ప్రవాసం, కృష్ణపక్షం, మల్లవరపు విశ్వేశ్వరావు మధుకీల, రవీంద్రుని ప్రభావంతో రాసినవే తెలుగు సాహిత్యంలో దేశభక్తి స్మృతి కావ్యాలు, శరత్, ప్రేమచంద్ నవలలు పుట్టుకొచ్చాయి.రవీంద్రసాహిత్యం తెలుగు యువ కవులు, రచయితలను ఆకట్టుకోవటంతో తెలుగు సాహిత్యంలో ప్రేమ, విరహం, కుటుంబ బాంధ్యవాలు, గ్రామీణ రైతాంగం స్థితిగతులు, జమీందారీ వ్యవస్థ నాటి సమాజంలో సృష్టిస్తున్న పరిణామాలు రచనలకు వస్తువుగా తెలుగు సాహిత్యం కొత్త పుంతలు తొక్కింది. విశ్వనాథ 'వరలక్ష్మీ త్రిశతి, దువ్వూరి రామిరెడ్డి ' భగ్నహృదయం', బాలాంత్రపు వేంకటరావు 'విరహ సంగీతం' ఎన్నో ఆ కాలంలో బెంగాలీ ప్రభావంతో వెలుగు చూసాయి. విశ్వనాథ వారి కిన్నెర పాటలు, ఆ ప్రేరణతోనే పెన్నేటి, సెలయేటి గానాలు విస్తృతంగా వచ్చాయి.

మన తెలుగు సాహిత్యంపై అన్యభాషా సాహిత్యాల ప్రభావం ఎంతైనా ఉంది. అదే విధంగా ఇతర భాషలను కూడా తెలుగు ఎంతో ప్రభావితం చేసింది. మహాకవి శ్రీశ్రీ మహా ప్రస్థానం కవితలపై బెంగాలీ కవి నజ్రుల్ ఇస్లామ్ గీతాలు, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ 'ఘురూ హో ఆ హేజంగ్' పాట ప్రత్యక్షంగా కాకపోయినా మనస్సులో మారు మూలలలో మారు మోగుతూ ఉండి ఉండాలి అనే ప్రస్తావన కూడా మన సాహితీ వేత్త ఆచార్య పోలి విజయ రాఘవరెడ్డి స్వయంగా ఉదహరించారు. తెలుగు గొంతుల్ని సవరించిన బెంగాలీ స్వరాలు అనే వ్యాసంలో తరతరాల తెలుగు విశేషాంశాలులో 'చీకోలు సుందరయ్య' సాహిత్యంలో ప్రభావం వివరించారు. పాశ్చాత్య సాహిత్య పరిచయ పాండిత్యాలు, వంగ కవితా భంగిమలు, తెలుగునాట తలెత్తిన రాష్ట్రాభిమానం, నాటి సాంఘిక సమస్యలు ప్రాచీన పద్ధతికి భిన్నంగా భావకవిత్వం పుట్టు కొచ్చింది. నాదేశం, నాజాతి, నాభాష, నాసంఘం అన్నభావం గురజాడ మహోన్నతం చేసారు. అంత మాత్రం చేత పరభావోన్నతిని, పర భాషలను ఈసడించి, చీదరించు కోవటం వంటి, మితిమీరిన స్వోత్కర్ష, జాతీయ దురహంకారం అసలు లేదు. విజ్ఞాన విస్తృతికి ఒక పరిధిలేదని 1910-1935 లలో తెలుగు కవులు గ్రహించి, చుట్టూరా వివిధ భాషా సాహిత్యాల మెలకువలను స్వీకరించారు. బహుభాషా కోవిదులైన తెలుగు కవులు, విభిన్న భాషా సమధ్యయనం ఆహ్వానించి సాహిత్య సీమలో కొత్త భావోద్వేగంతో, సరికొత్త సృష్టికి పరితపించారు.

దేశీయభాషలకు ప్రత్యేకంగా స్వంతమని చెప్పుకొనే అస్తిత్వం లేని రోజులవి. భిన్నత్వంలో ఏకత్వం చారిత్రక ప్రాధాన్యత సంతరించుకొని దక్షిణా పథంలో భాష, సంస్కృతి కలిసి మెలిసి జీవించాయి. ఏదేశమేగినా, ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరెదురైనా అంటూ రాయప్రోలు మహాకవి, ప్రబోధనం మార్మోగి తెలుగు కవుల కలాలను కదిలించింది. కన్నడంలోని ఛందః పరిణామం, షట్పది బెంగాలీ బాణీలు, పార్శీలోని ఒక విధమైన గజల్, రవీంద్రుని విశ్వజనీనత ఈ లక్షణాలన్నీ జాతీయ వైతాళికులలో స్పష్టంగా ప్రభావంతమై సాహిత్యం నడిచింది. తెలంగాణ సాహితీ సీమలో ఉర్దూరాజ్యం చేసినప్పటికీ, తెలుగు సాహిత్యం వెల్లివిరిసింది. నన్నయకు పూర్వమే గద్య, పద్యరచనలు కావ్యరచన చేయగలిగినంతగా వికసించాయి. ఇబ్రహీంకుతుబ్‌షా స్వయంగా ఉర్దూ భాషలో కవి అయినా తెలుగు బాషా సాహిత్యాలకు సన్నిహితుడై ఇభరాముడని కీర్తి పొందాడు. కుతుబ్‌షాహీల పాలనా కాలంలో ఉర్దూ, పారశీలతో పాటు తెలుగును ఆదరించారు.

## కవిత్వం

# కోయిలమ్మ స్వరమే.. రాగం!



ఆకాశం నుండి రాలుతున్న తారలు
తెగిపోయిన వీణ తంత్రులు
అయినా కానీ
రాత గర్భం నుండి
మొలుస్తున్న అంకురాలు
కోయిలమ్మ స్వరంలో
క్రొత్తరాగాలు
క్రొత్త గీతం పాడుతున్నాను
క్రొత్త ఉషోదయం
తొలు వెలుగు రేఖలు
పృథ్వి అంతా పరుచుకున్న
అరుణ రేఖలు
క్రొత్త గీతం పాడుతున్నాను
కరిగిపోయిన కలల
తాలుకు నిట్టూర్పు
ఎవరికి వినబడుతుంది
మనసులో దుఃఖం
కన్నీళ్ల రూపంలో
కళ్లనుండా రావడానికి
సిద్ధంగా ఉంది
ఓటమిని అంగీకరించను
కాలం అనే కాగితంపై
వ్రాస్తున్నాను
చెరిపేస్తున్నాను
క్రొత్త గీతం పాడుతున్నాను

**- అరుణ డేనియల్**

# ఒడ్డు ఓ దీర్ఘకావ్యం

పైన నీలినీలి మైదానం పిలుపు
కిందేమో ఆకుపచ్చ ఆకాశం తలెత్తే
నడిమిట్ల పారే ఊపిరి తడి ఒడ్డు

ప్రకృతి పరుచుకున్న భూమి నగ
గుండెనింపే పర్యావరణం పచ్చ రక్తం
బతికున్న ప్రాణ ఆరోగ్యం గీతం మనిషి

నడక నేర్పే ఒర్పు నది
గుండెతడి బతుకు
సంస్కృతి నాగరికతలే ఒడ్డుమట్టి

నది నాగరికత ఒడ్డు తొలిదారి
సుఖదుఃఖాల సహచరి
ఆకలిదప్పుల జీవన జీవకావ్యం

తడితడి గుండె గొంతుక
ఇంటి ముందు
ఆటుపోటు నురగ సంవేదన

మాటలకందని కరచాలనం
ఒడ్డూ నది
శబ్దనిశ్శబ్దాల గాలి

కదిలే నది పగలూ రాత్రి
కదలని ఒడ్డు రాత్రీ పగలు
మెలకువ నిద్రల్లేని బతుకే కబడ్డీ

**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు**



# ఇష్టం అంచు దాకా ..

నాకు నేను
అర్థమైనంతలో నిజాయితీగా మెలిగి
నమ్మకాన్ని అప్పచెప్పి
నిజాలతో లోతును పూడ్చి
మనసు నిలబెట్టుకున్నాను.
కానీ
కాలం మేల్కొపిన అర్థాలకు
నిజాల్ని మోసే బాధగా
బాధలో నడిచే నిజానిగా
పలుచనవుతున్నా..
ఇష్టం అంచు దాకా నడుస్తూ
మనసు ఆగేదు కాదు
నిజం వెనుకాడేది లేదు

**- చందలూరి నారాయణరావు**

# 'ఐ లవ్ యూ' అమ్మ

సుదీర్ఘ కావ్యంలో ప్రతిబింబించే
సుదూర జీవన ప్రవాహంలోప్రతిధ్వనించే
సువర్ణాక్షర చరితం
సుప్రభాత శ్లోకం.. అమ్మ !
అమ్మ చనుబాలే అమృతం
అమ్మ పాదస్పర్శే అద్భుతం

అమ్మ ప్రేమను మించిన కమ్మదనం
కానరాదు కాలప్రభావంలో
అమ్మ ప్రేమను పంచే శక్తి
స్వరూపమే లేదు
ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సంచలనంలో
అమ్మకు ప్రత్యామ్నాయం లేదు
అమ్మ తనానికి అస్తమయం రాదు

ఆకాశం నుండి చందమామా భూమిపైకి
రాదని తెలిసిన ఆగదు అమ్మ ఆలాపన
ఆ ఆకలి తీర్చడం కోసం తన ఆకలిని
త్యాగం చేసిన అమ్మే నా ఆరాధన
శతకోటి తారల కలల వెలుగే
తక్కువైపోతుంది
నా అమ్మ చిరునవ్వు ముందు.. !

నా సైన్స్ జగతిలో
నా సాహిత్యపు ప్రస్థానంలో
అణువణువు అమ్మే.
అక్షరక్షరం అమ్మే

**- ఫిజిక్స్ అరుణ్‌కుమార్**



# పావ్ బాజీ

కూరగాయలుతో తయారయ్యే పావ్‌బాజీ.. మనందరికీ మహా ఇష్టం. వేడి వేడిగా పావ్‌భాజీ తింటుంటే ఆహా.. ఎంత బాగుంటుందో.. వీధుల్లో దొరికే పావ్‌భాజీ రకాలు ఇంట్లోనే చేసుకుందామా !

## జైన్ పావ్‌బాజీ



కావలసినవి : కాశ్మీరీ మిర్చి-12, నూనె-టేబుల్ స్పూన్, వెన్న-మూడు చెంచాలు, జీలకర్ర-చెంచా, క్యాప్సికం ముక్కలు-అర కప్పు, టొమాటో ముక్కలు-రెండు కప్పులు, కారం-2 చెంచాలు, పావ్‌భాజీ మసాలా-ఒకటిన్నర చెంచా, ఉప్పు-తగినంత, సన్నగా తుంచిన క్యాలీఫ్లవర్, పచ్చి బఠాణీలు-ఒక కప్పు చొప్పున, కొత్తిమీర తరుగు-అర కప్పు, బన్నులు-8, వేయించిన అప్పడాలు-8, నిమ్మరసం-చెంచా,

**తయారీ :** కాశ్మీరీ మిర్చిని కొద్ది నీళ్లతో గ్రైండ్ చేసుకోవాలి. కడాయిలో నూనె, కొద్దిగా వెన్న వేసి వేడయ్యాక జీలకర్రను వేయించాలి. అందులో మిర్చి పేస్టు, క్యాప్సికం, టొమాటో ముక్కలు, అర కప్పు నీళ్లు,కారం, పావ్‌భాజీ మసాలా, ఉప్పు వేసి 5 నిమిషాలు ఉడికించాలి. తర్వాత క్యాలీఫ్లవర్ ఉడికించిన బఠాణీల గుజ్జు, కొత్తిమీర తరుగు వేసి మరో 5 నిమిషాలు ఉడికించాలి. మధ్య మధ్యలో కలియతిప్పుతూ, మెదుపుతూ ఉండాలి. కడాయిలో రెండు చెంచాల వెన్న, పావు చెంచా పావ్‌భాజీ మసాలా వేసి రెండు వైపులా వేయించుకోవాలి. ఉల్లి, టొమాటో స్లయిసులు, నిమ్మ చెక్క, పాపడ్‌లతో ఈ జైన్ పావ్ భాజీ సూపర్‌గా ఉంటుంది.

## ముంబై పావ్‌బాజీ

కావలసినవి : బన్నులు-8, వెల్లుల్లి ముక్కలు-2 చెంచాలు, ఉల్లి, క్యారెట్, టొమాటో,క్యాబేజ్, పచ్చి బఠాణీలు- ఒక కప్పు చొప్పున, క్యాప్సికం-అర కప్పు, కట్ చేసిన క్యాలీఫ్లవర్-2 కప్పులు, బంగాళదుంపలు-4, పావ్‌భాజీ మసాలా-3 చెంచాలు, అల్లం మిర్చి ముద్ద-చెంచా, నిమ్మరసం-చెంచా, వెన్న-2 చెంచాలు, కొత్తిమీర తరుగు-పావు కప్పు, ఉప్పు-తగినంత నూనె- అరకప్పు.

**తయారీ :** ముందుగా బన్నులను నేతిలో వేయించి పెట్టుకోవాలి. కడాయిలో నూనె కాగాక వెల్లుల్లి, అల్లం మిర్చి ముద్ద వేసి కొన్ని క్షణాలు వేయించాలి. తర్వాత ఉల్లి, టొమాటో, క్యారెట్ ముక్కలు, క్యాలీఫవర్ , క్యాబేజ్, పచ్చి బఠాణీలు, బంగాళదుంప ముక్కలు వేయించాలి. చివర్లో పావ్‌భాజీ మసాలా, ఉప్పు, నిమ్మరసం వేసికలియబెట్టి దించేయాలి. ఉల్లి, మిర్చి ముక్కలు, కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేస్తే సరి ఘుమఘుమలాడే పావ్‌భాజీ సిద్ధం. ఎక్కువ మంది ముంబై రకం ఇది.



## చీజ్ పావ్ బాజీ



కావలసినవి : నూనె-3 చెంచాలు, బంగాళ దుంపలు-3, టొమాటోలు-5, క్యారెట్-1, బీన్స్-6, ఉల్లిపాయలు-2, పచ్చిమర్చి-3, క్యాప్సికం-1, కాశ్మీరీ చిల్లీ పౌడర్-2 చెంచాలు, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్-చెంచా చొప్పున, ఉప్పు- తగినంత, పసుపు-అర చెంచా, ధనియాల పొడి, గరం మసాలా-రెండు చెంచాల చొప్పున, పావ్‌భాజీ మసాలా, బన్‌లు-8, చీజ్-కప్పు, నెయ్యి-2 చెంచాలు,కొత్తిమీర తరుగు-అరకప్పు

**తయారీ :** బంగాళ దుంపలు, టొమాటోలు,క్యారెట్ బీన్స్‌లను కడిగి ముక్కలు కోసి ఉడికించాలి. చల్లారాక మెత్తగా మెదపాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఉల్లి, పచ్చిమర్చి, క్యాప్సికం వేసి వేయించాలి. ఉడికించిన కూరగాయల మిశ్రమం, ఉప్పు, పసుపు, కారం, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్, ధనియాల పొడి, గరం మసాలా, పావ్‌భాజీ మసాలా,కొన్ని నీళ్లు వేసి కలియతిప్పి మగ్గనివ్వాలి. కొత్తిమీర, చీజ్ తరుగు వేసి దించేయాలి. పావ్‌ను నేతిలో వేయించాలి. వేడివేడిగా ప్లేటులో వడ్డించుకుని తినడమే తరువాయి.

## పనీర్ పావ్‌బాజీ

కావలసినవి : బన్నులు-8, బంగాళదుపంలు-3, టొమాటోలు-4, ఉల్లిపాయలు-2, పనీర్- కప్పు, ఉప్పు-కొద్దిగా,అ ల్లం వెల్లుల్లి ముద్ద-చెంచా, కారం-చెంచా, పసుపు-అరచెంచా, నెయ్యి, కసూనతరి మెంతి,, పావ్‌భాజీ మసాలా-2 చెంచాల చొప్పున, కొత్తిమీర తరుగు-అర కప్పు, నిమ్మరసం-చెంచా.

**తయారీ :** అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో కొద్దిగా నెయ్యి వేసి అందులో టొమాటో ముక్కలు, పచ్చి బఠాణీలు, క్యాప్సికం, ఉడికించి చిదిమిన బంగాళదుంప, అల్లం వెల్లుల్లి ముద్ద, ఉప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. అరకప్పు నీళ్లు పోసి మూత పెట్టాలి. మగ్గిన తర్వాత మెత్తగా మెదపాలి. కారం, పసుపు, పావ్‌భాజీ మసాలా, కస్తూరి మెంతి వేసి కలియతిప్పాలి. చివర్లో పనీర్ నెయ్యి, ఉల్లి, కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి. అంతే నేతిలో వేయించిన బన్నుతో భాజీ అమోఘంగా ఉంటుంది.



కీరదోసకాయ ప్రపంచంలో అత్యధికంగా పండించే కూరగాయలలో ఆరోగ్యాన్ని అందించే ఉత్తమ ఆహారాలలో అది ఒకటి అనితరంగా దీనిని ఒక సూపర్ ఆహారంగా సూచిస్తుంటారు.

# యాజ్ కుల్ యాజ్ కుకుంబర్

ఆనంద 'మైత్రేయ'మ్

"**యాజ్ కుల్** యాజ్ కుకుటర్' (కీర దోసకాయ లాగా చల్లగా) అనేది ఆంగ్ల పలుకుబడి. "కుకుమీస్ సాటివుస్" అనేది కీరదోసకు ఉన్న వృక్షశాస్త్ర పేరు కీరదోసకాయలు మండు వేసవిలో వేడిని నిరోధించడానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి: కీరదోసకాయ గుమ్మడి కుటుంబం 'కుకుర్బిటాసియా'కు చెందినది. కీరదోసకాయ కూరగాయల వర్గానికి చెందినదిగా విస్తృతంగా వర్గీకరించబడినప్పటికీ, ఇది కీరదోస పువ్వుల నుండి పెరుగుతుంది ఈ కీరదోసకాయ విత్తనాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల కీరదోస నిజానికి ఒక రకమైన పండు కీరదోసకాయను ఎక్కువగా ఇలాడ్స్‌లో రైతాలు తయారుచేయ డానికి ఉపయోగిస్తుంటారు. మన శరీరంలో న్యూట్రిషినల్ విలువలు పెంచడం కోసమే సలాడ్స్ తినడానికి ప్రధాన కారణం. ముఖ్యంగా గ్రీన్ సలాడ్స్‌లో కీరదోసకాయను మరియు టమోటోలను ఖచ్చితంగా చేర్చుకోవాలి. వీటి వల్ల శరీరానికి అనేక న్యూట్రిషినల్ విలువలు అందుతాయి. నిజానికి, చాలా మంది ఉదయం వివిధ రకాల జ్యూసులు త్రాగుతుంటారు. ఈ జ్యూసులు రోజంతా అవసరం అయ్యే ఎనర్జీని అందించడంలో సహాయపడుతాయి. చల్లగా చూడగానే తినాలపించే కీరదోస వేసవిలో సాంత్వన నివ్వడమే కాదు పుష్కలమైన పోషకాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. రీహైడ్రేటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉండటంతో రక్తపోటుతో బాధపడే వారికి ఇది చక్కని ఆహారం. స్వేదం ద్వారా కోల్పోయిన నీటిని, లవణాలను శరీరానికి తిరిగి అందించడంలో కీరదోస చక్కని పాత్ర పోషిస్తుంది. రోజు కప్పు కీరదోస రసం తాగితే మేని నిగారింపు సంతరించుకుంటుంది. దీని నుంచి విటమిన్ ఎ, సిలు పుష్కలంగా లభిస్తాయి. కీరదోసకాయ జ్యూస్ తాగడం ద్వారా అందులో ఉండే ఖనిజాలలోని ఆల్కలైన్ స్వభావమువల్ల రక్త ప్రసరణ చక్కగా జరుగుతుంది. దీంతో ఎసిడిటీ సమస్య



తగ్గుతుంది. అలాగే కీరదోస కాయ జ్యూస్ గ్యాస్ట్రిక్, డ్యూడెనం అల్సర్లకు చికిత్సగా ఉపయోగపడి ఉపశయనం కలిగిస్తుంది. ఎటువంటి రంగులు లేని కీరదోస కాయ జ్యూస్ వలన రక్తప్రసరణ క్రమబద్ధంగా ఉంటుంది వాతావరణం వేడిగా, వేడిగా ఉన్న రోజుల్లో కీరదోసకాయ జ్యూస్ ఏదైనా ఆకుకూరల రసంతో కలిపి తీసుకుంటే చలువ చేస్తుంది. శరీర ఉష్ణోగ్రతను సమతుల్యముగా ఉండేలా చేస్తుంది. మూత్రపిండాలలో రాళ్ళు కరిగి పోవడానికి మూత్ర విసర్జన చక్కగా జరగడానికి దోహద పడుతుంది కీళ్ళలో ఉండే యూరిక్ యాసిడ్‌ను తొలగించడం వల్ల వాపు, నొప్పి తగ్గిపోతాయి. ఆర్థ్రైటిస్, గౌట్ వ్యాధులలో ఇది మంచి చేస్తుది. కీరదోసకాయలో గల సిలికాన్, సల్ఫర్ ఖనిజలవణాలు జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తుంది. కీరదోసలో 96 శాతం నీరే. ఈ నీరు దేహాన్ని డిహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడు తుంది. దేహంలోని విషతుల్యమైన వ్యర్థాలను బయటకు పంపిస్తుంది. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, సోడియం ఉంటాయి. ఇవి రక్తపోటును క్రమబద్ధీకరిస్తాయి. హైబిపి అదుపులోకి రావాలంటే రోజు ఒక కీరదోస కాయను తినడం చక్కటి మార్గం. ఇందులోని 'కె' విటమిన్ ఎముకలు, కీళ్ల పని తీరును మెరుగు పరుస్తుంది. న్యూరాన్ల పనితీరు మెరుగవడంతో అల్జీమర్స్ రాదు. గోళ్ల పెళుసు బార దాన్ని తగ్గిస్తుంది. కడుపులో పురుగులను నిర్మూలిస్తుంది. హానికరమైన టాక్సిన్స్‌ను బాడీ నుండి ఫ్లష్ అవుట్ చేస్తుంది. ఇందులో ఫైబర్ ఉండటం వల్ల పొట్ట శుభ్రపడుతుంది. కీరదోసకాయను రోజులో ఎప్పుడైనా తినవచ్చు. అలాగే కీర దోసకాయకు క్యారెట్, ఆపిల్స్, మస్క్ మెలోన్ వంటివి జోడించి సలాడ్ రూపంలో తీసుకోవచ్చు. రోజు కీర దోసకాయ తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారిస్తుంది. మేజర్ హెల్త్ సమస్యలను నివారించడంలో కీరదోస సహాయపడుతుంది. బ్లాడర్ మరియు కిడ్నీ స్టోన్స్‌ను కరిగించి బయటకు నెట్టిస్తుంది. చిగుళ్ల సమస్య లను, మూత్ర సంబంధ సమస్యలను నివారిస్తుంది. ప్యాంక్రియాస్ పని తీరులో లోపం వల్ల ఎదురైన సమస్య లను కీరదోస పరిష్కరిస్తుంది. కాబట్టి మధుమేహంతో బాధపడేవారు రోజు తినవచ్చు. బరువు తగ్గడానికి కూడా కీరదోస దోహదం చేస్తుంది. కాబట్టి అధికబరువు, స్థూలకాయంతో బాధపడే వారు కూడా హాయిగా తినవచ్చు. కీరదోసకాయలో ఉండే నీరు పొడి బారిన చర్మానికి పోషణను అంది స్తుంది. దాంతో స్కిన్ సమస్యలు దూరమవుతాయి. ఇది చర్మంలోనికి చొచ్చుకొని పోయి.


స్కిన్ సెల్స్‌కు అవసరం అయ్యే మాయిశ్చరైజర్‌ను అందిస్తాయి. మిక్సీలో కీర దోసకాయ ముక్కలు వేసి పేస్ట్‌లా చేసి ముఖానికి అప్లై చేయడం ద్వారా డ్రై స్కిన్‌కు చెక్ పెట్టవచ్చునని బ్యూటీషన్లు అంటున్నారు.

కీరదోసను చర్మంపై రుద్దితే సన్ బర్న్ వంటి వాటి నుంచి ఉపశమనం లభిస్తుంది. దేహంలోని విష పదార్థాలను బయటకు పంపివేస్తుంది. దృష్టి సంబంధ సమస్యలను కీరదోసకాయ దూరం చేస్తుంది. కళ్ల కింద ఏర్పడే నల్లని వలయాలు కూడా పోతాయి.

కీరదోసను అడ్డంగా కోసి ఒక్కో ముక్కను కళ్లపై పెట్టుకుని కొంత సేపు ఉండాలి. తరచూ ఇలా చేస్తే కంటి సమస్యలు దూరమవుతాయి, ఇలా రెగ్యులర్‌గా చేస్తుంటే వాపు, కళ్ళ ఉబ్బు తగ్గుతుంది.

క్యాన్సర్‌లకు వ్యతిరేకంగా పోరాడే గుణాలు కీరదోసలో ఉన్నాయి. ప్రధానంగా అండాశయ, రొమ్ము, ప్రోస్టేట్, గర్భాశయ క్యాన్సర్‌లను నిరోధించే ఔషధ గుణాలు కీరదోసలో ఉన్నాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని కీరదోస కాయలు పరిరక్షిస్తాయి. మూత్రాశయ సంబంధ ఇన్ ఫెక్షన్లు రాకుండా చూస్తుంది. కీరదోసలో ఉండే ఆల్కనిటి స్టొమక్ అల్సర్ నివారించడంలో గ్రేట్‌గా సహాయపడుతుంది. రెండు గ్లాసులు కిరదోస జ్యూస్ తాగడం వల్ల ఇది స్టోమక్ అల్సర్ నివారిస్తుంది. బరువు త్వరగా తగ్గాలన్నా కీరతో వీలవుతుంది. కీరదోసకాయ జ్యూస్‌ను ప్రతి రోజు ఉదయం పరగడపున తీసుకోవాలి. కీర దోసకాయ వాటర్‌తో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. నిమ్మరసంతో పోల్చితే కీర దోసకాయ చాలా ఉత్తమమైనవని పరిశోధకుల నిర్ధారించారు. బరువు తగ్గాలనుకునేవారు కీర దోసకాయ రసం తాగాలని కోరుకునే వారు, కీరదోసకాయ రసంలో తేనె చేర్చి తీసుకోవాలి.

శరీరాన్ని హైడ్రేషన్‌లో ఉంచుకుంది. కీరదోసకాయలో 90 శాతం నీరు ఉంటుంది. రోజంతా మీకు అవసరమయ్యే ఎనర్జీని ఈ జ్యూస్



అందిస్తుంది. కీరదోసకాయ శరీరాన్ని డిహైడ్రేషన్ చేస్తుంది. తగినంత నీరు తీసుకోలేనిప్పుడు 90 శాతం నీరు ఉన్ని ఒక చల్లటి కీరదొసకాయ తినండి. కీరదోసకాయలో ఆస్కార్బిక్ మరియు కాపిక్ యాసిడ్స్ అధికంగా ఉండటం వల్ల కళ్ళ క్రింది చర్మలలో వాటర్‌ను తగ్గిస్తుంది.

తలనొప్పితో బాధపడే వారు కీరదోసకాయను రెగ్యులర్ డైట్‌లో చేర్చుకోవాలి. దీనిలో ఉండే విటమిన్. వాటర్ కంటెంట్, మరియు ఎలక్ట్రోలైట్స్ కారణంగా తలనొప్పి నివారించడంలో గ్రేట్‌గా సహాయపడుతుంది. హ్యాంగోవర్ తలనొప్పి కూడా ఎఫెక్టివ్‌గా తగ్గిస్తుంది. దోసకాయ మన శరీరంలో ఇన్సులిన్ స్థాయిని నియంత్రించడం ద్వారా మధు



మేహం నియంత్రిస్తుంది. శరీరంలో యూరిక్ అమ్లం పేరుకోవడం ద్వార వచ్చే కీళ్ళ జబ్బులకు కీర రసంలో క్యారెట్ కలిపి తాగితే ఎంతో మంచిది. కీరదోసకాయ తినడానికి సమయం సందర్భం ఏవీ అవసరం లేదు. రోజులో ఎప్పుడు తిన్నా అద్భుత ప్రయోజనాలను పొందవచ్చు. ఏదైనా కీటకం లేదా దోమలు కుట్టినప్పుడు ఆలర్జీ వల్ల వచ్చే నొప్పిని నివారించడంలో కీరదోసకాయ సహాయపడుతుంది.

**నాణానికి మరో వైపు**

కీరదోసకాయ అధిక వినియోగం తీవ్రమైన దుష్ప్రభావాలు మరియు అలెర్జీలకు దారి తీయవచ్చు. మనం తరచూ చేదు కీరదోసకాయలను తినడం జరుగుతూ ఉంటుంది, కానీ అధిక పరిమాణంలో కీరదోసను తింటే అది మన శరీరంలో విషపూరిమై, అటుపై ప్రాణాంతకామూ కావచ్చు. వాణిజ్యపరంగా లభించే కొన్ని కీర దోసకాయలకు చుట్టూ మైనపు పూత పూసి ఉంటుంది. ఇదెందుకంటే వాటిని క్రిమికీటకాలనుండి రక్షించేందుకే, అయినప్పటికీ, మైనపు పూత పూసిన ఆహారాలను సేవించడం సాధారణంగా ఆరోగ్యానికి మంచిది కాదు.కీర దోసలోని 'కుకుర్బిటాసిన్స్' అని పిలువబడే పదార్థం కారణంగా అది చేదురుచిని కల్గి ఉంటుంది. ఈ పదార్థం అత్యంత విషపూరితమైనది మరియు చేదురుచితో కూడిన పదార్థాల సేవనం మనకు ప్రాణాంతకం కాగలదు.కీరదోసకాయ అధిక మూత్రవిసర్జనకు దారి తీయవచ్చు. అధికభాగం నీటితో కూడిన కీరదోసకాయ సేవనంవల్ల మన శరీరంలో ఉండే వ్యర్థాలు మూత్రం ద్వారా విసర్జింపబడతాయి. అయినప్పటికీ, అధిక పరిమాణంలో కీరదోస కాయను సేవించడం అతిమూత్రవ్యాధికి దారి తీస్తుంది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. మరీ ముఖ్యంగా, గర్భిణులు, కీరదోసను ఎక్కువగా తినడం నిర్జలీకరణానికి దారి తీస్తుంది.

శీతలీకరణ ప్రభావాలతో కూడిన కూరగాయగా కీరదోసను వర్గీకరించవచ్చు. అయితే, దోసకాయ ఈ చలువ కల్గించే తత్వం కడుపుబ్బరానికి దారి తీస్తుంది, పరిమితంగా తిన్నా కూడా కీరదోస కడుపుబ్బరమే. దోసకాయ రసాన్ని సేవించడంవల్ల ముక్కులో తాప జనక ప్రతిచర్యను మరియు నాశికామార్గాల్లో అడ్డంకిని కలిగిస్తుంది. పడిసెం వంటి 'సైనసిటిస్' వ్యాధికి చికిత్స పొందుతున్న రోగులకు ఈ కీరదోస రసాన్నిచ్చినపుడు, అది వారి వ్యాధి పరిస్థితిని మరింతగా విషమింపజేసింది, అంతేగాక వాంతులు, మింగడానికి కష్టమవ్వడం (డిస్ఫ్రీజియా), ఆయాసం (డిస్‌ఆప్నియా), మొదలైనటువంటి లక్షణాలకు దారితీసిందని కనుగొనబడింది.

# చిలుక సాయం

కథ

అనగనగా రామాపురమనే గ్రామం. ఆ గ్రామంలో సాంబయ్య అనే రైతు ఉండేవాడు. అతని ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబం పోషించేవాడు. అయితే గత కొన్ని సంవత్సరాల నుండి కరువు కారణంగా పంటలు పండలేదు. సాంబయ్య రకరకాల పనులు చేసినా కలిసి రాలేదు. కుటుంబ పోషణ భారమై పోయింది. కుటుంబాన్ని పోషించుకోలేక ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడు. తన పొలంలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకోబోతుండగా 'ఆగు మిత్రమా!' అన్న మాటలు వినిపించాయి. చుట్టూ చూడగా చెట్టు మీద ఒక రామచిలుక కనిపించింది. రామచిలుక మాట్లాడటం చూసి ఆశ్చర్యపోయాడు. నేనూ నా కుటుంబం నీ పొలంలో పండిన జామపళ్లు తిని ఇంతకాలం బతికాం. మేము నీకు రుణపడి ఉంటాం. ఆ రుణం తీర్చుకునేందుకు నీకు సహాయం చేస్తాను. ఆత్మహత్య మహాపాపం. బతకటానికే ప్రయత్నం చేయాలి. నేను నీతో వస్తాను. నన్ను ఓ పంజరంలో ఉంచి చిలుక జోస్యమంటూ డబ్బులు సంపాదించవచ్చని చెప్పింది చిలుక. సాంబయ్యకు చిలుక చెప్పిన ఉపాయం నచ్చింది. చిలుక చెప్పినట్లు చేయడానికి ఒప్పుకున్నాడు. సాంబయ్య మధ్యాహ్నం వరకు చిలుక జోస్యం చెబుతుండేవాడు. మధ్యాహ్నం ఒక చెట్టు కింద సేద తీరేవాడు. ఈ ఖాళీ సమయంలో చిలుక ఊరిలో ఉన్న ఇండ్లపై ఎగిరి ఆ ఇండ్ల వివరాలు తెలుసుకుని సాంబయ్యకు చేరవేసేది.



ఆ వివరాలనే చిలుక జోస్యం పేరిట జనాలకి చెప్పేవాడు. తక్కువ కాలంలోనే సాంబయ్య మంచి పేరు సంపాదించటం సాంబయ్య శత్రువులకు నచ్చలేదు. చిలుక జోస్యమంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని రాజుకు ఫిర్యాదు చేశారు. రాజు సాంబయ్యను పిలిపించాడు. 'నేను ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసినా రాజ్యంలో పేదవారు తగ్గకపోవడానికి కారణం ఏమిటో వారం రోజుల్లోగా జోస్యం చెప్పాలి. సరిగ్గా చెప్పితే మంచి కొలువు ఇస్తాను. లేదంటే శిక్షిస్తాను అన్నాడు' రాజు. అలాగే ప్రభూ! అంటూ సెలవు తీసుకుని ఇంటికి వెళ్లాడు సాంబయ్య. చిలుక సాయంతో ఆ రాజ్యంలో పేదరికం తగ్గకపోవటానికి అవినీతి అధికారులు, వేగులు ఒక్కటైపోవడమని ఆ జాబితా రాజుకు అందించాడు సాంబయ్య. రాజు సాంబయ్య చెప్పిన అవినీతి అధికారులు, వేగులను కొలువు నుంచి తప్పించి కొత్తవారిని నియమించగా రాజ్యంలో పేదరికం పోయింది. రాజు సాంబయ్యను మెచ్చుకుని తన ఆస్థానంలో మంచి కొలువు ఇచ్చాడు. ఆ విధంగా చిలుక సాంబయ్యకు, రాజుకు సహాయపడింది.

**- సంగమనాయుడు రాళ్లబండి**

దారి చూపండి !







## బాలగేయం

### బాల్యమే భాగ్యము

అందమైన బాల్యము
తలపించును స్వర్గము
కల్మషమే లేనిది
జీవితాన భాగ్యము
సాగుతుంది నదిలా
సంగీత నాదంలా
సంతోషం అమితము
అవస్థలు పరిమితము
ఖరీదైన బాల్యము
మధురమైన స్వప్నము
మానవ జన్మలోనే
అత్యంత అమూల్యము
బాల్యానికి న్యాయము
చేయుట మన ధర్మము
నిర్లక్ష్యం చేస్తే
చేజారును నాకము
వెట్టిచాకిరితోన
బాల్యమగు నాశనము
వారి చోటు బడిలోన
చేయకు బందిఖానా
బాల్యము బహుభాగ్యము
దేవుని బహుమానము
తరచి తరచి చూడగా
మరువలేని జ్ఞాపకము

**- డా.గద్వాల సోమన్న**



## హలో ఫ్రెండ్...



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

### గిరీష్ అంకుల్ సమాధానాలు

**- బి. లక్ష్మీ, మహబూబ్‌నగర్**

ప్రశ్న: వర్షాన్ని పూర్వకాలంలో ఎలా కొలిచేవారు? ఆధునికంగా వర్షపాతాన్ని ఏ విధంగా కొలుస్తున్నారు ?

జవాబు: ఆధునిక శాస్త్రపరిజ్ఞానం వెలువడకముందు మన ప్రాచీనులు తమదైన విధానంలో వర్షాన్ని లెక్కించేవారు. దుక్కి - ఒక మానికె (కొలిచే మానికె పాత్రను బహిరంగ ప్రదేశంలో ఉంచేవారు. అది వర్షపు నీటితో నిండాలి). 16 మానికెలు - ఒక తుమూ 4 తూములు- ఒక నద్రోణము ఇవి కాకుండా సంభాషణలలో ఉజ్జాయింపుగా (సుమారుగా) చెప్పే మాటలు కూడా ఉండేవి. తడుపు వాన- ఒక మోస్తరు వాన, ఒక పెద్ద జల్లు. దుక్కి వర్షం - నాగలితో నేలను దున్నేందుకు పదును వచ్చే వర్షం. మడికట్ల వాన - చేలలో మడులు, వాటికి గట్లు ఉంటాయి కదా! ఆ గట్లు నిండితే పెద్దవానగా భావించవచ్చు. ఆధునిక కాలంలో వర్షపాతం కొలవడానికి వర్షమాపకం అనే పరికరాన్ని ఉపయోగించి సెంటీ తతమీటర్లలో కొలుస్తున్నారు.

**- కె. సాత్విక్, హైదరాబాద్**

ప్రశ్న: వర్షమాపకాన్ని ఉపయోగించి వర్షపాతాన్ని ఎలా కొలుస్తారు?

జవాబు : వర్షం కురిసినప్పుడు ఒక బహిరంగ ప్రదేశంలోని సమతలం మీద ఎంత ఎత్తుకు నీరు చేరుకుంటుందో ఆ మట్టం ప్రాతిపదికగా అక్కడ కురిసిన వర్షపాతాన్ని కొలుస్తారు. దీనిని కొలవడానికి ఉపయోగించే 'వర్షమాపకం' పరికరాన్ని లోహంతోగాని, ఫైబర్‌గ్లాస్‌తోగాని తయారు చేస్తారు. ఇది 8 సెంటీమీటర్లు-10 సెంటీమీటర్లు వ్యాసం గల ఒక గరాటా తరహాలో ఉంటుంది. ఈ గరాటా ఒక లీటరు సామర్థ్యం గల సీసాకు బిగిస్తారు. ఈ గరాటా ద్వారా సీసాలో పడిన వర్షపు నీటి ఘన పరిమాణం కొలవడానికి ఒక కొలజాడి ఉంటుంది. బహిరంగ ప్రదేశంలో సమతలంగా ఉన్న నేల మీద 30 సె.మీ. ఎత్తున అమరుస్తారు. ఆ సీసాలో సేకరించిన నీటి ఘనపరిమాణం కొలజాడీతో లెక్కిస్తారు. అందులో ఒక మిల్లీ మీటరు కంటే తక్కువ వర్షపాతాన్ని కూడా లెక్కించవచ్చు.







# ప్రపంచంలోనే ఖరీదు ఫ్యాబ్రిక్

అత్యంత ఖరీదైన ఫ్యాబ్రిక్ ఖరీదైన కశ్మీరీ నుంచి కాస్త అందుబాటులో ఉండే కాటన్, సిల్క్ లినెన్.. ఇలా రకరకాల ఫ్యాబ్రిక్స్ గురించి వినే ఉంటారు. వాటిల్లో ఒక్కో తయారీ విధానం, ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అయితే, ప్రపంచంలో కెల్లా అత్యంత ఖరీదైన ఫ్యాబ్రిక్ గురించి మీకు తెలుసా? అదేంటో, దాని విశేషాలేంటో తెలుసుకుందాం.

ప్రపంచంలోనే అత్యంత మృదువైన, అరుదైన ఫ్యాబ్రిక్‌గా 'వికూనా'కు (వికుమా ఫాబ్రిక్) పేరుంది. దీన్ని 'గోల్డ్ ఆఫ్ ఆండీస్'గా పిలుస్తుంటారు. ఒకప్పుడు రాజకుటుంబీకులు మాత్రమే ఈ ఫ్యాబ్రిక్ ధరించేవారట. అత్యంత పలుచగా, లేత బంగారు వర్ణంతో మెరిసిపోయే ఈ ఒక్క మీటరు ధర దాదాపు రూ.4 లక్షలకు పైమాటే అంటే. ఈ ఫ్యాబ్రిక్ బేసిక్ మోడల్ జాకెట్ కొనాలన్నా తక్కువలో తక్కువ రూ.17 లక్షలు కావాల్సిందే. 'అమ్మో.. అంత ఖరీదా?' అంటే నిస్సందేహంగా అవుననే చెప్పాలి.

**ఎందుకంత ధరంటే..**

'వికూన' అనేది ఒంటె జాతికి చెందిన ఓ జీవి. కాస్త పొట్టిగా, చలాకీగా ఉంటే ఈ జాతి జీవులు దక్షిణ అమెరికాలోని ఆండీస్ పర్వత సానువుల్లో మాత్రమే కనిపిస్తారు. 3200 నుంచి 4800 మీటర్ల ఎత్తయిన ప్రదేశాల్లో నివసిస్తూ.. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులనూ ఇవి తట్టుకోగలవు. రాత్రిళ్లు మంటలు మైనస్‌ల్లోకి పడిపోయినా, వీటి చర్మంపైన ఉన్న పొరలు వేడిని పట్టి ఉంచుతాయట. ఈ జీవుల ఉన్ని ఆ ప్రత్యేక లక్షణం కలిగి ఉండటంతో పాటు ఏడాదిలో ఒక వికూన నుండి కేవలం 500 గ్రాముల నుండి మాత్రమే ఉత్పత్తి అవుతుందట. ఆ లెక్కన.. ఒక జాకెట్(కోటు)ను తయారు చేయడానికి కనీసం 25 జీవులు అవసరమవుతా యన్నమాట. మూడేళ్లకోసారి మాత్రమే వీటి నుంచి ఉన్నిని (vicuna wool) సేకరిస్తారట. ఆ తర్వాత ఆ కూనకు గుర్తుగా ఒక ట్యాగ్ లాంటిది వేసి మళ్లీ అడవుల్లోకి వదిలేస్తారట. ఆండీస్ పర్వత ద్రోణుల్లోని వాతావరణంలో తప్ప మరెక్కడా ఈ జీవుల జాడ కనిపించదు కాబట్టే వాటికి అంత డిమాండ్.



వికూనాల నుంచి సేకరించే ఉన్ని కాబట్టి ఆ ఫ్యాబ్రిక్ ఆ పేరొచ్చింది. ఫ్యాబ్రిక్ కశ్మీ కంటే రెట్టింపు మృదుత్వాన్ని కలిగి ఉంటుంది.

**అంతరించిపోయే జాబితా మంచి..,**

ఇష్టానుసారం వేటాడటం వంటి కారణాలతో 1980 దశకంలో ఈ వికూనాల సంఖ్య తగ్గడం. అంతరిచిపోయే జాబితాలోనూ చేరాయి. పరిస్థితి ఇలాగే ఉంటే, భవిష్యత్తులో వాటి ఉనికే ప్రశ్నార్థకం కానందని అక్కడి ప్రభుత్వాలు, యునెస్కోతో సహకారంతో విమానాల సంరక్షణకు నడుం బిగించింది. కట్టుదిట్టమైన చర్యలతో క్రమంగా వాటి సంఖ్య పెరగసాగింది. ఆ సమయంలోనే వెచ్చదనాన్ని పట్టి ఉంచే ఆ జీవుల ఉన్న గొప్ప తనం ప్రపంచానికి తెలిసింది. వాణిజ్య పరంగానూ ప్రాధాన్యత సంతరించు కుంది.

## పట్టు దారాలతో అందం

పట్టు బట్టల గొప్పతనం తెలిసిందే! తాకితే ఎంత మెత్తగా ఉంటాయో... ధరిస్తే అంత అందంగా ఉంటాయి. కీటకాలూ, కొన్నిరకాల ఫంగస్‌ల నుంచీ సేకరించిన ఈ పట్టు లేదా ప్రొటీన్ దారాలని వస్త్రాల తయారీలోనే కాకుండా ఇప్పుడు వైద్యంలోనూ అందుబాటులో ఉన్న శాస్త్రవేత్తలు, ముఖ్యంగా వృద్ధాప్య ఛాయలను వెనక్కి నెట్టి, ముఖ సౌందర్యాన్ని పెంచడానికి ఈ దారాలు ఎంతగానో ఉపయోగపడతాయని యూకేకి చెందిన న్యూక్యాజిల్ యూనివర్సిటీ పరిశోధకులు ఈ దారమైనపురుగుల్లోని కొన్ని రకాల పురుగులతో నిండిన కొన్ని రకాల పురుగులు. ఇవి గాయాలు మానడానికీ, చర్మంలోని తేమ కోల్పోకుండా ఉండేందుకూ, కొలాజెన్ పెంచడానికీ సహకరిస్తాయట. అందుకే ఈ దారాలని ముఖంలోని ముడతలు తొలగించి, మృదుత్వాన్ని పెంచడానికి ఉపయోగించొచ్చని చెబుతున్నారు పరిశోధకులు. సర్జరీ అవసరం లేకుండా చర్మంలో తేలిగ్గా కలిసిపోయే ఈ పోగులు ముఖంలో కొలజెన్‌ని పెంచి చర్మానికి పూర్వపు యౌవనాన్ని అందిస్తాయట.



# ఎదిగే వయసులో పోషకాలే జతగా.. !

రజస్వల వయసుకి చేరువవుతున్న అమ్మాయిల్లో శారీరకంగా, మానసికంగా పలు మార్పులు చోటుచేసుకోవడం సహజం. హార్మోన్ల స్థాయుల్లో హెచ్చు తగ్గుల వల్లే ఇలా జరుగుతుంటుంది. నిజానికి ఈ మార్పులు టీనేజీ దశలోకి ప్రవేశించే అమ్మాయిలకు కాస్త తాజా పరిస్థితి, ఇబ్బంది కలగజేస్తుంది. అయితే ఈ దశలో మార్పులొచ్చినా.. వాటి ప్రభావం వారిపై పడకుండా ఉండాలంటే.. వారి ఆహారంలో పలు మార్పులు చేర్పులు చేయాలని నిపుణులు భావిస్తున్నారు.



ముఖ్యంగా ముందు నుంచే కొన్ని పదార్థాలను వారికి అందించడం వల్ల.. పోషకాలన్నీ వారి శరీరానికి అందుతాయి.. ఈ దశనూ వారు అధిగమించగలరు! హార్మోన్లను సమతులంగా ఉంచడంలో ఐరన్ కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి రజస్వలకు చేరువవుతున్న అమ్మాయిల్లో హార్మోన్ల ఆరోగ్యానికి ఐరన్ అధికంగా లభించే మునగాకు పొడి మంచి ప్రత్యామ్నాయం అంటున్నారు నిపుణులు. రోజూ టీస్పూన్ పొడిని వారు తినే వంటకాల్లో భాగం చేయడం లేదంటే ఉదయాన్నే ఓ గ్లాసు నీటిలో కలిపి ఇవ్వడం.. తాగితే మంచిది. అవిసె గింజల్లో ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియంతో పాటు 'సి', 'ఇ', 'కె' వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఈ పోషకాలన్నీ హార్మోన్ల స్థాయుల్ని క్రమబద్ధీకరించేవే కాబట్టి టీనేజ్ అమ్మాయిలకు ఇది మంచి ఆహారం. వీటిని లడ్డులు, పొడి, కూరల్లో భాగం చేయడం.. ఇలా వారికి వచ్చినట్లుగా అందించ వచ్చు.



రజస్వల ప్రారంభమైన తొలినాళ్లలో కొంతమంది అమ్మాయిలకు ఎక్కువ రక్తస్రావం అవుతుంటుంది. దీనివల్ల రక్తహీనత తలెత్తకుండా ముందు నుంచే జాగ్రత్త పడమని చెబుతున్నారు నిపుణులు. ఈ అంజీర్ వారి ఆహారంలో చేర్చడం మంచిది. ఈ పండు హిమోగ్లోబిన్ స్థాయుల్ని పెంచడమే కాదు.. రక్తాన్నీ శుద్ధి చేస్తుంది. అయితే వేడి శరీరం ఉన్న అమ్మాయిలకు దీన్ని రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే ఇవ్వాలి. ఒంట్లో మరింత వేడి పెరగకుండా జాగ్రత్తపడచ్చు. టీనేజ్‌లోకి ప్రవేశించే అమ్మాయిల్లో ఎముకల ఆరోగ్యానికి క్యాల్షియం ఎక్కువగా ఉండే పాలు, పాల పదార్థాలను అందించాలి. ఒకవేళ ఇవి ఇష్టపడకపోతే.. బాదం/కొబ్బరి/సోయాపాలు చక్కటి ప్రత్యామ్నాయం. అలాగే ఆకుకూరలు, బ్రకోలీ కూడా వారికి మేలు చేస్తాయి. శరీరంలో హార్మోన్ల మార్పుల వల్ల నీరసం, అలసట ఆవహిస్తుంది. వీటిని ఎదుర్కొని శారీరక శక్తిని స్థాయుల్ని పెంచుకోవాలంటే బీన్స్, పప్పులు, చేపలు, నిమ్మజాతి పండ్లు, సెరల్స్ శరీరంలో కొన్ని రకాల హార్మోన్ల మార్పుల కారణంగా కడుపుబ్బరం వంటి జీర్ణక్రియ సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. కాబట్టి ఎదిగే అమ్మాయిల్లో ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే ఫైబర్ అధికంగా ఉండే బ్రౌన్ రైస్, క్వినోవా, ఓట్స్, తాజా పండ్లు, కాయగూరలు, పప్పులు వాటి మెనూలో చేర్చాలి. శరీరంలో హార్మోన్లు, ఎంజైమ్‌ల స్థాయుల్ని క్రమబద్ధీకరించి.. కండరాలను దృఢ పరచడంలో ప్రొటీన్ల పాత్ర కీలకం. కాబట్టి రజస్వలకు దగ్గరయ్యే అమ్మాయిలు.. ప్రొటీన్లు ఎక్కువగా లభించే చేపలు, మాంసం, పప్పులు, గింజలు, కోడిగుడ్లను ఆహారంలో చేర్చుకోవాలి.

**ఇవీ ముఖ్యమే!** రజస్వలకు చేరువవుతున్న అమ్మాయిల్లో హార్మోన్ల ఆరోగ్యానికి ఆహారంతో పాటు కొన్ని అలవాట్లను పాటింపజేసేలా చూడడమూ ముఖ్యమేనంటున్నారు నిపుణులు. రోజూ అరగంట పాటు వ్యాయామం చేయడం వల్ల హార్మోన్లూ సమతులంగా ఉంటాయి.. మానసిక సమస్యలూ దరిచేరవు. బరువు కూడా అదుపులో ఉంటుంది భవిష్యత్తులో పీసీఓఎస్, థైరాయిడ్ వంటి సమస్యలు రాకుండా జాగ్రత్తపడవచ్చు ఈ వయసులో పిల్లలు జంక్ ఫుడ్, శీతల పానీయాలకు ఎక్కువగా ఆకర్షితులవుతుంటారు. కానీ వీటి వల్ల కూడా హార్మోన్ల మార్పు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కాబట్టి అమ్మాయిలు వీటికి దూరంగా ఉండేలా చూడడం ముఖ్యం. టీనేజ్ అమ్మాయిల నిద్ర సమయాల్ని కూడా పరిశీలించాలి. రోజుకు ఏడెనిమిది గంటలు ప్రశాంతంగా పడుకునేలా చూడాలి. దీనివల్ల కూడా హార్మోన్ల ఆరోగ్యం బాగుంటుంది. అలాగే రజస్వల సమయంలో శారీరక మార్పులతో వారు ఆందోళన పడకుండా ఉండాలంటే.. తల్లులు ముందు నుంచే ఆయా మార్పుల గురించి వారికి వివరించాలి. అప్పుడే వారిలో కంగారు మాయమౌతుంది.

కథ

# ప్రతి రుతువు లోను వసంత హరితం

ఎస్. రవీంద్రనాథరెడ్డి

అది చైత్ర, వైశాఖపు సంధికాలం. కానీ భూతాపం ప్రభావంతో రోహిణీకార్తె ఎండలను తలపిస్తున్నది. తన పొలానికి పక్కనున్న ఏరులోని ఇసుకను ట్రాక్టర్‌కు లోడ్‌చేసిన కూలీలు, చింతచెట్టు నీడన అలసి సేద తీరుతున్నారు. ఆ చెట్టు తన పుట్టిరోజు జ్ఞాపకార్థం తన తండ్రినాటిన చెట్టు అని 'లక్ష్మణమూర్తి'కి విస్మృతి కానీ జ్ఞాపకం. దూరంగా సుడిగాలి ఉధృతికి ఎర్రదుమ్ముతో పాటు, ఎంగిలాకులు, చెత్త చెదారం సుడులు తిరుగుతున్నాయి. అచ్చం తన మనస్సులోని ఆలోచనల రొదలాగా...

గత పది రోజులుగా తన మనస్సు మనస్సులో లేదు. యాతన చెద పురుగులా తొలిచేస్తున్నది. ఈ మట్టి, ఈ నేల, ఈ భూమి, ఈ చెట్టు తన ప్రాణం. తన సర్వస్వం, తన అస్థిత్వం. ఈ నేల 'అమ్మకం' అనే ఊహే తన గుండెను పిండేస్తోంది. తన ప్రాణ వాయువును హరింప జేస్తోంది. మట్టికి ఆకృతి వచ్చినప్పటి నుండి ఈ భూమి వ్యాపార వస్తువు అయి పొయ్యింది. ఈ భావనే లక్ష్మణమూర్తికి చిత్రంగా తోస్తోంది. ఈ చెట్లపై నర్తించే పవనం, వీచే మలయమారుతం తన తాత ముత్తాతల ఊసులు, ఈ పారే సెలయేటి గలగలలు తన పితృదేవతల గుసగుసలు. అటువంటి ఈ వారసత్వ సంపద భూమిని, పవిత్ర భూమిని అమ్మకం' అనే 'ప్రక్రియ చేదు గుళికలా గొంతు నాళంలో మింగుడు పడటం లేదు. లక్ష్మణమూర్తికి వ్యవసాయంపై, భూమిపై, ప్రకృతిపై తీరని మమకారం. చావైనా, బ్రతుకైనా ఈ నేలతోనే అనిపించే పిచ్చితనం. మంచి చదువరి అయినా తెలుగు పండిట్ శిక్షణ, 'విద్వాన్' పూర్తి చేసినాఉద్యోగంవైపు చూడకుండా ప్రకృతితో మమేకమైపోయి, భావకవిత్వం వ్రాసుకొనే భావుకుడు లక్ష్మణమూర్తి. కానీ రసాయన వ్యవసాయంలో సైన్స్ తెచ్చిన దుష్పరిణామాల ఫలితంగా బోర్లు వేసి రసాయనిక ఎరువులు వేసి ఓడిపోయాడు. రసాయనిక ఎరువులు భూమికి చేసిన చెఱుపుపట్ల ఎరుక తెచ్చుకొని 'ప్రకృతి వ్యవసాయం'తో భూమికి జవసత్వాలు అందించే' యజ్ఞం మొదలు పెట్టాడు. జీవనసమరంలో ఎన్నో ఆటు పోట్లకు లొంగని భీష్మతత్త్వుడు లక్ష్మణమూర్తి. కానీ, పొలం అమ్మాలనే ఆలోచనకు జావగారి పోయాడు. కాస్త దూరంలో రావిచెట్టు నీడలో ఇసుకనే పాన్పుగా చేసుకొని ఆదమరచి నిద్రపోతున్నాడు భాస్కరయ్య. తనను, తన పొలాన్ని బాల్యం నుండి వదలని స్నేహం భాస్కరయ్య, లక్ష్మణమూర్తిది. కులం వేరయినా, భాస్కరయ్య పేదరికం అయినా వారి స్నేహానికి అడ్డురాలేదు. తన కుమారుడితో పాటు భాస్కరయ్య కుమారుడిని ఇంజనీరింగ్ చదివించాడు లక్ష్మణమూర్తి. భాస్కరయ్య కుమారుడు దినేష్ ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో ఐదంకెల జీతం తీసుకొనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. అయినా భాస్కరయ్య తనను, తన పొలాన్ని వదలని బంధం. సుఖదుఃఖాలలో, కష్టసుఖాలలో, ఆపదలలో ఒకరికొకరు అండగా నిలబడిన స్నేహితులు వీళ్లు. గత వారం లక్ష్మణమూర్తి కొడుకు హేమంత్ ఇంటికి వెళ్ళి వచ్చినప్పటి నుండి చింతనాపరులై పోయారు. కొడుకు, కోడలితో జరిపిన సంభాషణ అలలు అలలుగా జ్ఞాపకం వస్తూ కోత కోస్తోంది.

.. ..



కొడుకు కబురు పెట్టాడని భాస్కరయ్యతో కలిసి తిరుపతిలోని పద్మావతినగర్‌లో హేమంత్ ఇంటికి వచ్చారు లక్ష్మణమూర్తి. దినేష్, హేమంత్‌లు కలిసి ఇంజనీరింగ్ చేసినా, హేమంత్ ఉద్యోగంవైపు చూడకుండా టి.టి.డి. కాంట్రాక్టర్‌గా స్థిరపడి, ఇటీవల రియల్ ఎస్టేట్‌రంగంలో దిగి, బాగా సంపాదించినాడు. ఖరీదు అయిన ఇల్లు కట్టుకున్నాడు. లక్ష్మణమూర్తి స్వంత చెల్లెలు కుమార్తె తులసిని కోడలుగా చేసుకొన్నాడు. తులసి లక్షణమైన పిల్ల. లక్ష్మణమూర్తికి, భాస్కరయ్యకు చక్కటి భోజనం వడ్డించింది. భోజనం అయిన తర్వాత వరండాలో కూర్చున్నారు. లక్ష్మణమూర్తి కొడుకు, కోడలితో. 'నాన్నా, అమ్మా నీవు అక్కడ ఇబ్బంది పడుతున్నారు. ఇంక వ్యవసాయం మానేయండి. అక్కడ మీరు ఎలా వున్నారో అని ఆందోళనగా వుంటుంది. ఇక్కడ మీకు ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా గది కూడా వుంది'.

'ఇక్కడ మేము ఏమి చేస్తాం కన్నా! అక్కడ దినేష్ ఎంత వత్తిడి చేసినా ఈ మట్టిని వదలలేక భాస్కరయ్య కూడా పోలేదు. పొలం ఏదో చేస్తూ కాలం గడిపేస్తాం'.

'నాన్న ఇంక సేద్యంలో నష్టాలు ఏమాత్రం భరించలేను. దయచేసి ఇంక మానేయండి'.

'లేదు నాన్నా, ఇప్పుడు ప్రకృతి వ్యవసాయం ఒక ఎకరంలో మొదలుపెట్టాను. నేలకు సారం తెచ్చాను. ఖర్చు తగ్గిస్తాను.

క్రమంగా పది ఎకరాలకు విస్తరిస్తాను. ఇప్పుడిప్పుడే భూమికి జీవం వస్తోంది. మట్టి పరిమళం సంతరించుకొంటోంది' అన్నాడు లక్ష్మణమూర్తి. 'నాన్న నువ్వు ఆ పిచ్చి నుంచి బయటపడాలి. ఆ పది ఎకరాలు అమ్మేసి రియల్‌ఎస్టేట్‌లో పెడదాం' అన్నాడు హేమంత్.

'భూమి అమ్మకం' అనే మాట ఎక్కడలేని ఆవేశం తెప్పించింది లక్ష్మణమూర్తికి. 'భూమి వ్యాపార వస్తువు కాదురా! వ్యవసాయం వ్యాపారం కాదు అది భారతీయ జీవన విధానం. నా ఊపిరి ఉన్నంతవరకు అమ్మడం కుదరదు' తెగేసి చెప్పాడు.

అంతవరకు దూరంగా నిల్చుని వింటున్న తులసి ఒక్కసారిగా భగ్గుమన్నది. 'భూమి వ్యాపార వస్తువు కాదు మామయ్యా! కానీ మేము వ్యాపారంలో సంపాదించినది తీసుకెళ్ళి లక్షలు తగలేశారు. ఆరు బోర్లు వేశారు, వేలకు వేలు పురుగులమందులు, ఎరువులు వాడారు. పైసా తిరిగి రాలేదు. పిల్లలు పెద్దవాళ్ళు అవుతున్నారు. లక్షలకు లక్షలు ఫీజులు కట్టాలి. వాళ్ళ భవిష్యత్తు పైన మీకు ఆలోచనే లేదు.' అవాక్కయిన లక్ష్మణమూర్తి ఆలోచనలోపడ్డాడు.

'నిజమే తాను కూడా లక్షలు, లక్షలు వ్యవసాయ పిచ్చితో తగలేశాడు. చాలా మొత్తం ఇచ్చాడు హేమంత్, ప్రస్తుతం వారి పిల్లలు పెద్దవుతున్నారు. ఖర్చులు పెరిగాయి. తాను ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయంతో భూమికి జీవంపోసే యజ్ఞంలో వున్నాడు. కానీ అణుకువ, సుగుణవతి అయిన కోడలు ఇలా మాట్లాడటం, వ్యవసాయంలో తాను నష్టం చేయడం, లక్ష్మణమూర్తిని వెనుకకు తగ్గేటట్టు చేసింది.

ఒక పదినిమిషాల తర్వాత దీర్ఘంగా నిట్టూర్చి 'సరే తల్లీ, మీ ఇష్టం, కానీ ఉగాది వస్తోంది, పిల్లలతో తప్పకుండా ఊరికి రండి' అని భారంగా లేచాడు.

రూపాంతరం చెందుతున్న మానవసంబంధాలకు ప్రత్యక్ష సాక్షి అయిన భాస్కరయ్య 'ఇది కలియుగం కాదు, అవసరయుగం' అనుకొంటూ లేచాడు.

పొడ ఎండ నేరుగా ముఖంపై పడడంతో చిరాగ్గా తల విదిల్చి లేస్తూ 'కొడుకూ, కోడలు వచ్చేసి వుంటారు, ఇంటికి పోదాం అన్నా'! అన్నాడు భాస్కరయ్య. ఈ మాటతో ఆలోచన సుడుల నుంచి తల విదిల్చి ఇంటిదారి పట్టాడు.

అప్పటికే కొడుకు, కోడలు, మనవడు లిఖిత్, మనుమరాలు జయప్రదితతో కలిసి ఇంటికి వచ్చేశారు. కాస్తా ముభావంగా పొడి పొడిగా పలకరింపులు అయినాయి. మర్నాడు ఉగాది పండుగకు కావాల్సిన ఏర్పాట్లలో హడావుడిగా వుంది. లక్ష్మణమూర్తి అర్ధాంగి శారదమ్మ. తండ్రితో ఏకాంతంగా మాట్లాడడానికి అవకాశం కోసం చూస్తున్నాడు హేమంత్. జడ్జిమెంట్‌కోసం చూస్తున్న నిరపరాధిలా ఎదురుచూస్తున్నాడు లక్ష్మణమూర్తి.

డాబామీద విశ్రాంతి తీసుకొంటున్న లక్ష్మణమూర్తి వద్దకు వచ్చాడు హేమంత్. 'వారం ముందు నాలుగైదు పార్టీలు వచ్చాయి ఎకరం యాభై లక్షల వరకు ఇస్తాం అంటున్నారు. అడ్వాన్స్ తీసుకోమంటారా'! అడిగాడు.

'నీ ఇష్టం' అంటూ బొంగురు బోయిన గొంతుతో, దుఃఖస్థితి కనపడకుండా అక్కడనుండి విసవిసా వెళ్ళి పోయాడు లక్ష్మణమూర్తి. ఇంతలో దినేష్ వచ్చాడు భాస్కరయ్యతో కలిసి, వస్తూనే 'బాగున్నావా! హేమంత్, బాగున్నారా వదినా, బాగున్నారా పెద్దమ్మా' అంటూ ఆప్యాయంగా పలకరించాడు. కాసేపు రియల్‌ఎస్టేట్, షేర్స్, సినిమాల కబుర్ల అనంతరం 'హేమంత్! నువ్వు పెదనాన్న డైరీ చదివావా ఎప్పుడైనా'? అని అడిగాడు దినేష్.

'లేదు అన్నాడు. 'అయినా నాన్న డైరీ రాస్తాడని నీకెలా తెలుసు?' 'ఒకసారి అనుకోకుండా పెదనాన్న డైరీ అరుగుపైన మరిచిపోయాడు. వద్దనుకుంటూనే చదివాను. ఆయన ఆత్మను డైరీలో ఆవిష్కరిస్తాడు. ప్రకృతిపట్ల ఆ మహాను భావునికి ఉన్న ఆరాధన, జగతిపట్ల ఉన్న భావుకత్వం నాకు మదిలో వుండిపోయింది' చెప్పాడు దినేష్.

'హేమంత్ నువ్వు ఏమీ అనుకోనంటే పొలం నేనే తీసుకుంటా. హెచ్ క్రాస్ వద్ద ఒక సైట్ వుంది, దాన్ని అమ్మేసి పొలం తీసేసుకుంటా'.

'అదేమిటి? అది మంచి కమర్షియల్ సైట్ కదా'! 'నిజమే, కానీ నాన్నకు, పెదనాన్నకు ఆ పొలంతో పేగుబంధం. వారు బ్రతికున్నంత వరకు పెదనాన్న ఆధీనంలోనే వుంటుంది పొలం. ఆ తర్వాతే నేను అడుగుపెట్టేది' అని చెప్పి సెలవు తీసుకొన్నాడు దినేష్. పండుగ ఏర్పాట్లలో ఇల్లు సర్దుతున్న తులసి చెవిన పడ్డాయి ఈ మాటలు.

అప్రయత్నంగా లక్ష్మణ మూర్తి డైరీలు కనపడగానే పేజీలు తిప్పింది. ఏదో తెలియని ఉద్వేగం తన్నుకు వచ్చింది. భర్తను పిలిచి కొన్ని పేజీలు చదవమని చూపించింది.

**వైశాఖం, 3వ తారీఖు, 1952:** తాత, నాన్నమ్మ సమాధులకు వెల్ల వేయించాడు నాన్న. సమాధుల చుట్టూ రావి, వేప, సంద్ర చెట్లు నాటిస్తున్నాడు. సమాధుల పైన తులసి మొక్కలు నాటుతూ' ఈ చెట్టు, గాలి,మట్టి, నీరు రూపంలో పితృదేవతలు మనల్ని కనిపెట్టుకొని ఉంటారు రా! లక్ష్మణా' అన్నాడు నాన్న.

**శ్రావణం, ద్వాదశీ, 1960:** వరుసగా మూడు సంవత్సరాలు వర్షాలు లేవు. ఊరంతటికీ త్రాగునీరు పెద్ద సమస్య అయిపోయింది. గత నాలుగు నెలలుగా కూలీలు బావి తవ్వుతున్నా, నీటి జాడలేదు. ఈరోజు రిగ్గ్ బండి వచ్చింది. తాత సమాధికి టెంకాయ కొట్టి, పూజచేసి, రిగ్గ్‌తో రంధ్రాలువేసి టోటా పెట్టి పేల్చారు. ఒకసారిగా నీటి ఊట బయటకు వచ్చింది. చూస్తూ వుండగానే రెండు మట్ల వరకు నీరు బావిలో తోడయింది. ఊరు ఊరంతా సంబరం. బావి దగ్గరే శారద, భాస్కర, భార్య చిన్నక్క పరమాన్నం, కోడికూర వండి కూలీలకు వడ్డించారు. బావిలో నీరు, నాన్న కళ్లలో పన్నీరు. రావిచెట్టు నవ్వుతోంది అచ్చం తాతలా.

**ఆశ్వీయుజం, త్రయోదశీ, 1965:** మూడు రోజులుగా కురిసిన వర్షం వెలిసింది. ఈరోజు వైకుంఠ ఏకాదశి. నారు పోయాలి. వర్షం కారణంగా పచ్చిక భూమిని చీల్చుకొని గర్వంగా తలెత్తుకొంటున్నాయి. ఏవో మాటలు నాతో మాట్లాడు తున్నాయి. ఆరుద్ర పురుగులు హడావుడిగా పరుగులు తీస్తున్నాయి. ఎక్కడో చదివిన జ్ఞాపకం, 'భూమికి పచ్చిక పట్టుచీర అయితే ఆరుద్ర పురుగులు నక్షత్రాల డిజైన్ అంట'. ఎందుకో మట్టివాసన ఆఘ్రాణించాలని అనిపించింది.

మట్టికీ, మనిషికీ తీరని ఋణం.

**సందేహాల మబ్బులు తొలగిన ఆ ఇంట్లోకి ఒక్కసారిగా సూర్యతేజస్సు విస్తరించింది. టాటా చెబుతున్న పిల్లలతో కారు దుమ్ము లేపుకుంటూ బయలుదేరింది. ఇంటిముందు మామిడి చెట్టుపై కోయిల కూ... కూ... అంటూ తానూ వీడ్కోలులో భాగం అయ్యింది.**

**చైత్రం, ద్వాదశీ, 1970:** నాన్న ఇదే రావిచెట్టు క్రింద నెలక్రితం అలసటగా వుందని పడుకొన్నాడు. మళ్ళీ లేవ లేదు. ఆయన చెపుతున్నట్లే ఆ మట్టిలోనే శాశ్వత విశ్రాంతి తీసుకొన్నాడు. కానీ 'నాన్న ఈ రేణువులలో, ఈ గాలిలో నన్ను చూస్తూ సంరక్షిస్తాడని నా నమ్మకం'.

**ఫిబ్రవరి 20, 2024:** కొడుకు, కోడలు భూమిని అమ్మి వ్యాపారంలో పెట్టాలని అన్నారు. సేద్యంలో నేను తెచ్చే అప్పులు భరించలేరంట. ప్రకృతి వ్యవసాయంలో జీవం తెస్తానని చెప్పలేని నిస్సహాయత నాది. ఈ చెట్టు, ఈ గాలి, ఈ నీరు, నీ తండ్రి, తాత, నానమ్మ ఊసులని, గుసగుసలని ఇవి పవిత్రమని, వీటిని కొనుగోలు చేసినవాడు ఇంతే పవిత్రంగా చూసుకొంటాడా! అని అడగాలని వుంది'.

**మార్చి 27, 2024:** రేపు ఉగాది. బహుశా నా పొలంలో పితృదేవతలకు ఇచ్చే నైవేద్యం చివరదేమో. ఈ పితృపూజ అభివ్యక్త ప్రకార్యం అయితే, కుటుంబం పట్ల ప్రేమ, బాధ్యత, పరంపరగా తరతరాలు సాగడానికి దాగివున్న అంతర్లీన ప్రకారం అని ఈ వ్యాపార దృక్పథంతో సాగే ఈ తరానికి ఎలా చెప్పాలి. మీ సంతతికి మీరు ఏమి నేర్పగలరని ఎలా నిలదీయాలి. కానీ, నిలదీయలేని నిస్సహాయత, అశక్తత నాది. డైరీ చూసి ఒకరినొకరు చూసుకొన్నారు తులసీ, హేమంత్. మాటల్లో చెప్పలేని భావోద్వేగం, కళ్ళనిండా నీరు, డైరీ వలనో, దినేష్ మాటల ప్రభావమో, తన పొలంలో తన తండ్రి కౌలుదారుడు కావాలా! అనే పశ్చాత్తాపమో. మోనంగానే ఒక నిర్ణయానికి వచ్చారు ఇద్దరూ.

.. .. ..

ఉగాది పండుగ సంతోషంగా గడిచింది. పిల్లలు, లక్ష్మణమూర్తి దంపతులవద్ద ఆశీర్వాదం తీసుకొన్నారు. బయలుదేరేముందు ఆశీర్వాదం కొరకు వంగిన తులసికి మామయ్య పాదం మహోన్నతంగా కనిపించింది. అప్రయత్నంగానే ఒక కన్నీటిచుక్క పాదంపై పడింది. అదిరిపడిన లక్ష్మణ మూర్తి 'ఇదేమిటమ్మా'! అన్నాడు 'క్షమించండి మామయ్యా, భూమి వ్యాపార వస్తువు కాదని, దానితో మన కుటుంబానికి బంధమని అర్థమ య్యింది. ఇంక భూమి అమ్మకం అనే ఊహను కూడా రానియ్యం' అంది తులసి. ఉబికివస్తున్న ఆనందభాష్పాలు తుడుచుకొంటూ, గద్గద స్వరంతో 'సంతోషం తల్లీ' అన్నాడు లక్ష్మణమూర్తి. సందేహాల మబ్బులు తొలగిన ఆ ఇంట్లోకి ఒక్కసారిగా సూర్యతేజస్సు విస్తరించింది. టాటా చెబుతున్న పిల్లలతో కారు దుమ్ము లేపుకుంటూ బయలుదేరింది. ఇంటిముందు మామిడి చెట్టుపై కోయిల కూ... కూ... అంటూ తానూ వీడ్కోలులో భాగం అయ్యింది. పక్కింటివాళ్ళ రేడియోలో వివిధభారతి కార్యక్రమంలో 'మావి చిగురు తినగానే కోయిల పలికేనా అనే పాట వస్తోంది. బహుశా ఆ 'మట్టిమనిషి'కి ఇక ప్రతి ఋతువు వసంత హరితమే, ప్రతి ఉగాదిలోను దీపావళి వెలుగులే.. □

## తడి తగిలితే స్పాంజ్‌లవుతాయి



వంటింట్లో పాత్రలు తోమడానికి వాడే ప్లాస్టిక్ స్క్రబ్బర్లు ఓ పట్టాన తడి ఆరవు. దాంతో వాటిల్లో చేరి, దుర్వాసన వస్తుంది. అలా కాకుండా, వేగంగా ఆరిపోయి దుర్వాసన రాకుండా చూస్తే పాప్ స్పాంజి. పూలు, పండ్ల బొమ్మలతో చూడ డానికి అందమైన బొమ్మల్లా ఉన్న ఉ స్క్రబ్బర్లు పొడిగా ఉన్నప్పుడు పలుచగా రేకుల్లా ఉంటాయి. తడి తగలగానే ఉబ్బి, మెత్తని స్పాంజ్లగా తయారై.. పాత్రలు తోమడానికి వీలుగా మారి పోతాయి. చెట్ల గుజ్జుతో తయారుచేసి ఈ పాప్‌అప్ స్పాంజిలు మృదువుగా... నాన్‌స్టిక్, గాజు పాత్రలు తోమడానికీ బాగుంటాయి.

□

## గ్యాస్ సిలిండర్ ఏటీఎం

దాదాపు అందరి ఇళ్లలో అదనపు గ్యాస్ సిలిండర్ ఉంటుంది. ఒక్కోసారి గ్యాస్ బుక్ చేయడం మర్చిపోవచ్చు. లేదా ముందుగా బుక్ చేసుకున్న సమయానికి సిలిండర్ రాకపోవచ్చు. అలాంటప్పుడు గ్యాస్ అయిపోతే ఎంత ఇబ్బందో అందరికీ తెలుసు. అదే, ఏటీఎంలో డబ్బుల మాదిరి ఎప్పుడంటే అప్పుడు సిలిండర్ కూడా తీసుకునే అవకాశం ఉంటే ఎంత బాగుంటుందో కదా. సరిగ్గా భారత్ గ్యాస్ సంస్థ కూడా అలానే ఆలోచించింది కాబోలు, ఏఐతో నడిచే ఎల్పీజీ ఏటీజీ(ఎనీ టై గ్యాస్ సిలిండర్) కేంద్రాలను రూపొందించి క్షణాల్లో సిలిండర్లు చేతికొచ్చే ఏర్పాట్లు చేసింది. ప్రయోగాత్మకంగా బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో ఏర్పాటు చేసిన ఈ ఏటీజీ సెంటర్లలోని స్క్రీన్పైన గ్యాస్ ఐడీకి అనుసంధానమైన ఫోన్ నంబర్నీ, ఇతర వివరాలనీ నమోదు చేయాలి. తరవాత అక్కడున్న మెషిన్‌లో ఆ సిలిండర్ని ఉంచితే ఏఐ స్కాన్ చేసి దాన్ని తీసుకుని... ఐదు లేదా పది కిలోల కొత్త సిలిండర్ ఇస్తుంది. ఏ సమయంలో అయినా ఏర్పాటుకు అందుబాటులో ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్న భారత్ గ్యాస్ త్వరలోనే దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఏటీజీలను సిద్ధం చేసింది. □



# ఈ-వ్యర్థాల రీసైకిల్

**రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ బాటిల్స్, పాత ఎలక్ట్రానిక్ వస్తువులు, తాగి పారేసిన జ్యూస్ టెట్రా ప్యాక్స్ ఇలా ఎన్నో రకాల వ్యర్థాలు కనిపిస్తుంటాయి. వాటిలో కొన్నింటిని రీసైకిల్ చేయొచ్చని వింటుంటాం. కానీ, ఏ చెత్తతో ఏం తయారు చేస్తారో చాలా మందికి తెలియదు. అవేంటో తెలుసుకుందామా....**

### టెట్రాప్యాక్స్....

పాలు, జ్యూస్ ఎక్కువకాలం మన్నికగా ఉండేందుకు టెట్రాప్యాకెట్స్లో విక్రయిస్తుంటారు. మనం కొని తాగేసి పడేస్తుంటాం. వాటిని సేకరించి పేపర్స్, రూఫింగ్ షీట్స్, బెంచ్, డెస్క్ వంటి ఫర్నిచర్స్ తయారు చేస్తారు.

### ఈ-వేస్ట్ .....

పాత మొబైల్ ఫోన్స్ ఛార్జర్స్, విరిగిపోయిన ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉండే లోహాలను కరిగించి.. వాటి నుంచి బంగారం, వెండి, రాగి, పెల్లాడియం వంటి రసాయన మూలకాలను వెలికితీస్తారు. వాటిని కొత్త ఎలక్ట్రానిక్ వస్తువుల్లో వినియోగిస్తారు.

### ప్లాస్టిక్ బాటిల్స్

తాగి పడేసే ప్లాస్టిక్ బాటిల్స్ తిరిగి కొత్త ప్లాస్టిక్ బాటిల్స్ తయారు చేస్తారు. దీని ద్వారా కొత్త వాటి అవసరం తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. అలాగే పాలిస్టర్ ఫైబర్గా మారుస్తారు. ఈ ఫైబరు దుస్తులు, పిల్లో, కుషన్స్, బొమ్మల తయారీలో వినియోగిస్తారు. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే



మెటీరియల్గానూ మార్చొచ్చు.

టూత్‌పేస్ట్, షాంపూ, పౌడర్ బాటిల్స్ ఇంట్లో ఉపయోగించే టూత్‌పేస్ట్, షాంపూ, పౌడర్ బాటిల్స్ అయిపోగానే బయటపడేస్తుంటాం. అలాంటి ప్లాస్టిక్ వస్తువులతో తిరిగి కొత్త బాటిల్స్ తయారు చేస్తారు. ఇంట్లో ఉపయోగపడే ప్లాస్టిక్ వస్తువులు, ప్యాకింగ్‌కు ఉపయోగపడే మెటీరియల్స్ నుగానూ మలుస్తారు.



### సిగరెట్ పీకలు

సిగరెట్లు తాగి వాటి పీకలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుంటారు చాలా మంది. వాటిని సేకరించిన కుషన్లు, బొమ్మలు, కీ చైన్‌లు కొన్ని రీసైక్లింగ్ కంపెనీలు తయారు చేస్తున్నాయి. భారత్‌లోని ఓ అయితే, ఏకంగా వాటిని సేకరించేందుకు సంస్థ దేశవ్యాప్తంగా పలు పాన్/కిరాణా షాపుల వద్ద ప్రత్యేకంగా డబ్బాలను ఏర్పాటు చేసింది.



### దుస్తులు

మన దేశంలో పాత దుస్తులను విరాళంగా ఇస్తుంటాం. చిరిగిపోయిన వాటిని పారేస్తుంటాం. అలాంటి దుస్తుల నుంచి ఫైబర్ను సేకరించి బ్లాంకెట్స్, డోర్మ్యాట్స్, ఫర్నిచర్స్, బ్యాగ్స్ నిల్వ తయారు చేస్తున్నారు.

**గ్లాస్ ...** గ్లాస్ బాటిల్స్‌ను కూడా రీసైకిల్ చేయొచ్చు. వాటితో, మళ్లీ కొత్త గ్లాస్ బాటిల్స్, ఫైబర్ గ్లాస్, ఇంటి నిర్మాణం ఉపయో పడే మెటీరియల్‌లను తయారు చేస్తున్నారు. క్రియేటివ్ డిజైన్ వర్క్స్ లోనూ వాడుతున్నారు.

**పేపర్స్ ..** కొన్ని రకాల రసాయనాలను ఉపయోగించి పేపర్లపై ఉండే ఇందాకను తొలగిస్తారు. అనంతరం నీళ్ల రసాయనాలు కలిపి ముద్దగా చేస్తారు. కస్బోర్డులు, బ్యాగులు, గిఫ్ట్ వాటి కవర్లు ఆఫీస్ పేపర్స్ స్టాట్ తయారు చేస్తారు.

వాడేసిన నూనె ... ఒకసారి వాడిన నూనెను మళ్లీ వాడకూడదు. ఇంట్లో అయితే తక్కువగా పారేస్తుంటాం. కానీ, కొన్ని సంస్థలు రెస్టారెంట్లు, ఇతర ఫ్యాక్టరీల్లో వాడేసి పక్కన పెట్టిన నూనెను సేకరించి బయో డీజిల్ తయారు చేస్తున్నారు. దీని ద్వారా ఇంధన కొరతను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.



# వాళ్లు తెరచిన పుస్తకం

**యామిజాల జగదీశ్**



**బర్మాలో మానవనాగరికతకు బహుదూరానగల అడవిలో ఒక గిరిజన సమూహం ఉంది. చెప్తే నమ్మరు. వాళ్ళకు గొడవలంటే ఏమిటో తెలియదు. వాళ్ళు ఒకరితో ఒకరు గొడవపడరు.**

అంతకన్నా మరో విచిత్రం, వాళ్ళు కలలో కూడా తప్పుగా నడచుకున్నది లేదు. అదెలా సాధ్యమని అడగవచ్చు. ఎందుకంటే కల అనేదే తప్పుగా నడచుకోవడానికి ఏర్పడే చోటన్నది వారి అభిప్రాయం. మానసిక తత్వవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ 'మనిషి అణచివేసిన తన అంతరంగ ఆశలను నెరవేర్చుకునే చోటు కల' అని అన్నాడు. ఈ ప్రపంచంలో మనం అనుకున్నదల్లా మాట్లాడం. అలాగే అనుకున్నదల్లా చెయ్యలేం.

సమాజం మనల్ని అనేక విధాలుగా నియంత్రిస్తుంటుంది. మనం కూడా ఊరు ఏమనుకుంటుందోనని భయపడి మన ఆశలెన్నింటినో అణచివేసుకుంటాం. ఈ ఆశలలో తప్పయినవీ ఉంటాయి. అయితే అటువంటి తప్పుడు ఆశలు అంతరించి పోవు. అవి అంతరంగంలో దాగి ఉంటాయి. దొంగలు చీకట్లో బయటకు వచ్చినట్లు కలలో ఆ ఆశలు వచ్చి పోతుంటాయి. కల మనిషి అంతరంగ గది. అక్కడ తన ఇష్టమొచ్చినట్లు నడచుకుంటాడు. తాను చేస్తున్న పని ఎవరికైనా నచ్చలేదంటే వారి అడ్డు తొలగించుకుంటాడు.

కల అనేది సెన్సార్ చెయ్యని చిత్రంలాంటిది. అంతరంగమే దాని దర్శకుడు. కథ, మాటలు, పాటలు, నిర్మాత, అన్నీనూ!

కొన్నిసార్లు కలలో మనం మన తీరునే చూసి ఇబ్బంది పడతాం. ఏమిటి ఇలా నడచుకున్నాం అని అనుకుంటాం. కానీ ఎప్పుడో ఎక్కడో ఒక దురాశ మనలో ఉండి ఉండవచ్చు. ఆ ఆశ ఆరోజు కలలో కనిపించొచ్చు. ఉర్దూలో ఒక కవిత ఉంది నా కలలో నా అనుమతి లేకుండా నువ్వెలా ప్రవేశించావు అని ఒకడడుగుతాడు. కానీ అవతలి వ్యక్తి 'అది నా ఇల్లు. నేను ఆ ఇంట్లోకి రావడానికి ఎవరి అనుమతీ పొందక్కరలేదు' అని. కల ఒక మాయాలోకం. అక్కడ మనల్ని అసహ్యించుకునే వ్యక్తి మనల్ని ఇష్టపడతాడు. కల అనేది స్వర్గమై ఉంటుంది. నరకంగానూ ఉంటుంది.

కల ఒక విచిత్ర అద్దం. అందులో మనిషి ఏది దాస్తాడో అది చూస్తాడు.

ఒకవేళ ఎవరైనా తప్పుడు కలలు కంటే తెల్లవారడంతోనే ఊరిపెద్దకు ఆ విషయం చెప్పాలి. ఎవరిపట్లయితే తప్పుగా నడచుకున్నాడో వారికి ఆ విషయం చెప్పాలి. అలా చెప్పేటప్పుడు వాళ్ళకు కానుకగా పువ్వు, పండు లేదా స్వీటో తీసుకువెళ్ళాలి. వాళ్ళకు అది కానుకగా ఇచ్చి 'కలలో మీ పట్ల తప్పుగా నడచుకున్నాను. దయచేసి నన్ను క్షమించండి' అని అడగాలి. వాళ్ళు క్షమిస్తేనే వెనక్కు రావాలి. క్షమించకుంటే క్షమించేంతవరకు వారి ఇంటి వాకిట్లో కూర్చోవాలి. అది ఆ గిరిజనుల అలవాటు. అక్కడి గిరిజనులు కలలనూ దాచకూడదు. కలలోనూ తప్పుగా నడచుకోకూడదు. దీని వల్లే వాళ్ళు కలలోనూ తప్పుగా నడచుకోవడం లేదు. గొడవలు పటం లేదు. వాళ్ళు మానసిక శాస్త్రం చదువుకున్న వాళ్ళు కాదు. వాళ్ళకసలు అలాంటి అంశం ఒకటుందని కూడా తెలియదు. కానీ వాళ్ళు తమకు తెలియకుండానే ఒక గొప్ప మానసిక వైద్యాన్ని అందించారు. దానితో తమ ప్రజలు తప్పుగా ఆలోచించడమనేదే లేదు. తప్పుడు ఆలోచనలు లేవంటే కలలూ అవసరం లేదు. అందుకే వాళ్ళు చాలా వరకు కలలనే కనడం లేదు. పడుకోవడంతోనే హాయిగా నిద్రపోతారు. అది గాఢమైన నిద్ర అవుతుంది.

కలలతో కూడిన నిద్ర సాఫీగా సాగదు. అందుకే వాళ్ళు కల అనే రోగానికి అవసరమైన మందు కనిపెట్టారు. దాంతో వాళ్ళు ఆరోగ్యంగా ఉన్నారు. కనుకే వీళ్ళను తెరచిన పుస్తకంగా అభివర్ణించడం అన్ని విధాల సబబనిపించింది. వీళ్ళు మంచు బిందువంత స్వచ్ఛంగా నిర్మలంగా ఉంటారు. □

## మాట్లాడితే మంచిదే !



**ఆడవాళ్ళ సుభాషిణులు... అందంగా, వినసొంపుగా** మాట్లాడతారనే అభిప్రాయంతోపాటూ, ఎక్కువ మాట్లాడతారనే భావనా ఉంది. ఇందులో ఎంతవరకూ నిజం ఉందనే విషయంపైన ఆరిజోనా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశోధన చేశారు. ఆడవాళ్లైనా, మగవాళ్లైనా సుమారుగా పాతికేళ్ల వచ్చేంతవరకూ ఒక రోజులో దాదాపుగా సమానమైన పదాలనే ఉపయోగిస్తారట. ఆ తర్వాత అంటే... పాతిక నుంచి అరవైనాలుగేళ్ల వచ్చేంతవరకూ ఆడవాళ్ల రోజువారీ సంభాషణల్లో మగవాళ్లతో పోలిస్తే మూడువేల పదాలు ఎక్కువగా ఉంటాయట. ఇలా ఉండటానికి ప్రధాన కారణం... పిల్లలట. వాళ్లకి జాగ్రత్తలు చెబుతూ, తీర్చిదిద్దే క్రమంలోనే ఈ పదాల సంఖ్య పెరుగు వస్తుందని ఈ అధ్యయనం తేల్చింది. ఆ బాధ్యతలన్నీ తీరిపోయే సమయానికి అంటే, అరవై ఏళ్ళు దాటేసరికి ఆడవాళ్లూ, మగవాళ్లూ వాడే పదాలు తిరిగి సమానంగా ఉంటున్నాయని తేలింది. నాలుగు దేశాలకు చెందిన స్త్రీ పురుషులని ఎంచుకుని వారు మాట్లాడిన ఆరున్నర లక్షల రికార్డు పరిశీలించాక వెల్లడించిన విషయాలివి. అలాగే, వ్యాయామం చేయడంలానే చక్కగా మాట్లాడటం కూడా ఆరోగ్య లక్షణమే అంటున్నారు శాస్త్రవేత్తలు. □

# 'సూర్యకిరణావరోధ వేధ' లేని ఇల్లే

# వాస్తు దోషాలకు దూరం


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458






**'సూర్యకిరణావరోధ వేధ' అంటే ఏమిటి?**

సూర్యోదయం నుండి మొదటి, నాల్గవ జామున సూర్యకిరణాలు ఒక నిర్మాణమునందు (గృహం, దేవాలయం, మఠం, బావి, కోట మొదలయిన) పడకపోయినట్లయితే ఆ నిర్మాణం 'సూర్యకిరణ అవరోధ వేధ' అనే వాస్తు దోషమును బాధించి చెడు ఫలితాలనిస్తుంది.

ఇక, మొదటి నాల్గవ జాతులంటే ఏ సమయం (ఎన్ని గంటల నుండి ఎన్ని గంటల వరకు) అనే మీమాంస కలుగుతుంది. ఈ కింది కాల నిర్మాణ పట్టికను ఒకసారి గమనిస్తే ఆ మీమాంస కూడా తొలగుతుంది. అంతేగాక ఏ సమయంలో ఏమి చేస్తే మంచిదో కూడా తెలుస్తుంది.

ఉదయం (సూర్యోదయం సమయం) నుండి అపరాహ్నం(దాదాపు) 3 గం॥ 30 ని॥ లోపు నిర్మాణం (ఇల్లు) లోని ఏదో ఒక భాగంలో సూర్యకిరణాలుపై నుండి గృహ ఉపరితలం నుండి ప్రసరింపబడాలి. అటువంటి ఇంట్లో 'సూర్యకిరణావరోధ వేధ' ఉండదు. ఈ వేధ లేని ఇంట్లో వాస్తు దోషాల తీవ్రత తగ్గుముఖంగా ఉంటుంది. అందుకే పాత కాలంతో వాస్తు దోషాల తీవ్రత తక్కువగా ఉండే విధంగా 'భవంతీ ఇండ్ల'ను ఒక మోడల్ హౌజ్‌గా డిజైన్ చేశారు. నాలుగు వైపుల వాలుగా పెంకులుండి మధ్యన ఆకాశానికి తెరిపిగా ఉండే ఇండ్లే ఎక్కువగా కనిపిస్తాయి. మధ్యలో ఆకాశానికి తెరిపిగా ఉండే స్థానం నుండి ఎండ నేరుగా పై నుండి ఇంటి లోపలికి వచ్చేది. 'సూర్యకిరణావరోధ వేధ' ఉండేందుకు తావులేని వాస్తు ఇండ్లు ఇవి. వేరే విధమైన కొన్ని వాస్తు దోషాలున్నప్పటికీ వాటి తీవ్రత తగ్గి సత్ఫలితాలను పొందటానికి అనువైనవిగా ఉండేవి.

శ్లో॥ దేవాలయం నా భవనం
మఠశ్చభావోః
కర్షైన్యము ఖిరే న భిన్న।
తన్మూల భూవెకా పరివర్జనీయం
ఛాయా గతాయస్య గృహస్య కూపే ॥

ఇలాంటి దోషాన్ని కలిగివున్న నిర్మాణం, బావి వివిధ రకాల రోగాలను, పశు నష్టం కలిగిస్తుందని చెప్పబడింది. సూర్యరశ్మి దూరని చోట నివసించే వారికి అనారోగ్యం కలుగుతుందనటంలో ఎవరికీ ఏ విధమైన సందేహం ఉండదు. అలాగే సూర్యరశ్మి సోకని బావిలోని నీరు కూడా విషమం అని గ్రహించక తప్పదు. గాలి, వెలుతురు చక్కగా ప్రసరించాలని గృహవాస్తు నియమాలు నొక్కి వక్కాణిస్తున్నాయి.

సూర్యోదయం 6.00 గం॥ అని అనుకుంటే-

1) 6.00 నుండి 6.24 వరకు: ప్రాతఃకాలం-పూజలు

2) 6.24 నుండి 10.48 వరకు : సంగమ కాలం-శుభ కార్య ప్రారంభం

3) 10.48 నుండి 1.12 వరకు: మధ్యాహ్న కాలం-శ్రాద్ధాదులు ప్రారంభం

4. 1.12 నుండి 3.36 వరకు : అపరాహ్నం-శ్రాద్ధాదులు పూర్తి గావించాలి.

5) 3.36 నుండి 6.00 వరకు: సాయంకాలం-ప్రయాణారంభములు

6) 6.00 నుండి 8.24 వరకు: రాత్రి-వివాహ, గృహ ప్రవేశాలు

7) 8.24 నుండి 10.48 వరకు: రాత్రి-శుభకార్యాలు



8) 10.48 నుండి 1.12 వరకు: రాత్రి అర్ధరాత్రి/నిశీధి కాలం-మంత్ర శాస్త్ర ఆచరణ

9) 1.12 నుండి 3.36 వరకు : రాత్రి/బ్రహ్మణే పూర్వకాలం -మంత్రశాస్త్ర ఆచరణ

10) 3.36 నుండి 6.00 వరకు: బ్రహ్మకాలం-దేవతార్చనాదులు

(వివాహాది, శుభకార్యములు, గృహ ప్రవేశాలు, గృహారంభాలు, శంకుస్థాపనలు, ప్రయాణాది విషయాల్లో సమయమొక్కటే గాకుండా- తిథి, వార, నక్షత్ర కరణాది పంచాంగమును కూడా అవసరమైన వేళను పాటించటం తప్పనిసరవుతుంది) ✦

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, **3-2-4**, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-**3**

వాస్తువార్త

పూర్తి పేరు : ........................................

పుట్టిన తేది : ........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............

చిరునామా:..........................................

# కొండలలో కొలువైన కోనేటి రాయడు

**ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

**కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరుడు అనేకానేక క్షేత్రాలలో కొన్నింటిలో స్వయంవ్యక్తిగా మిగిలిన క్షేత్రాలలో ప్రతిష్ఠిత మూర్తిగా కొలువు తీరి కొలిచిన వారికి కొంగు బంగారంగా దర్శనం ప్రసాదిస్తున్నారు. శ్రీ శ్రీనివాసుడు స్వయంవ్యక్తగా వెలిసిన క్షేత్రాలన్నీ కొండల మీద ఉండటం ప్రత్యేకం!**

శ్రీవారు అనేక పుణ్యతీర్థ క్షేత్రాలలో ముఖ్యంగా పావన కృష్ణాతీరంలో శ్రీ వెంకటేశ్వరునిగానే కాకుండా తన అవతార రూపాలైన శ్రీలక్ష్మీనరసింహునిగా, శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా కూడా కొలువై పూజలందుకొంటున్నారు.

శ్రీవారి దర్శనంలో బ్రహ్మకడిగిన పాదాలతో పాటు దివ్యమైన సుదర్శన చక్రం, పాంచజన్య శంఖం మరియు తిరునామాలకు విశేష ప్రాధాన్యత ఉన్న విషయం మనందరికీ తెలిసిన విషయమే! స్వామివారి దివ్యమంగళ రూపం కాకుండా చక్రం, శంఖం మరియు తిరునామాలతో మాత్రమే దర్శించుకొనే ఆలయాలు గుంటూరు జిల్లా కృష్ణాతీరంలో ఉన్నాయి. ఎన్నో శతాబ్దాల క్రిందటివిగా పేర్కొనే ఆ క్షేత్రాల గురించి ఒక దాని తరువాత ఒకటిగా తెలుసుకొందాము. అనీ దర్శనీయ క్షేత్రాలే!



**కృష్ణవేణి నది..**
మనదేశంలోని అనేకానేక నదులలో మూడవ అతిపెద్ద నదిగా ప్రాముఖ్యం కలిగినది కృష్ణానది. మహారాష్ట్రలో జన్మించి 1300 కిలోమీటర్ల ప్రవాహమార్గంలో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేస్తూ, కోట్లాది మంది దాహార్తిని తీరుస్తూ కృష్ణవేణమ్మ మన రాష్ట్రంలో కృష్ణాజిల్లా హంసలదీవి వద్ద సాగరునితో సంగమిస్తుంది. నదీమతల్లి ప్రవాహమార్గంలో లెక్కలేనన్ని దివ్య తీర్థ పుణ్య క్షేత్రాలు నెలకొని ఉన్నాయి. ముఖ్యంగా నల్గొండ, కృష్ణా మరియు గుంటూరు జిల్లాలలో ఎన్నో పురాతన మరియు నూతన ఆలయాలు వెలిసి ఉన్నాయి. కృష్ణవేణీ మహత్యం ఆధారంగా కృష్ణానది శ్రీమన్నారాయణుని పాదపద్మాల నుండి ఉద్భవించినది అని తెలియవస్తోంది. అందువలన వాత్సల్యభావనతో స్వామి ప్రత్యేక అర్చారూపంలో కొలువైనారేమో! అనిపిస్తుంది.

**వైకుంఠ పురం** శ్రీవారు ప్రత్యేక రూపంలో స్వయంవ్యక్తగా కొలువైన క్షేత్రాలలో ఒకటి పంచారామ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ అమరేశ్వరస్వామి కొలువైన అమరావతికి సమీపంలోస్వామివారు భూలోకంలో కృష్ణాతీరంలో విహరిస్తూ "క్రౌంచగిరి" మీద తొలి యుగంలో స్థిరపడ్డారని ఆలయ చరిత్ర తెలుపుతోంది. ఇక్కడ కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రవహిస్తుంది. అప్పట్లో ఈ ప్రాంతమంతా "ఐరావతి" అని పిలిచే నేటి అమరావతి ప్రభువుల పాలనలో ఉండేదట. సమీప లంక గ్రామం అయిన రాపూరు ఒక బ్రాహ్మణ అగ్రహారం. ఆ రోజులలో అతి పెద్ద సంపద గోవులే! పాలేరుల చేత తమ గో మందలను ఈ కొండ మీదకు మేత నిమిత్తం తోలేవారట. మనం ఎన్నో ఆలయ పౌరాణిక గాథలలో విన్న మాదిరి మందలోని ఒక ఆవు రోజూ పలు ఇవ్వడం లేదట. విషయాన్ని స్వయంగా తెలుసుకొందామని గ్రామ పెద్దలు, ఆవుల మందకు యజమానులైన కండ్లకొలను పెదరామన్న, చిన్న రామన్న కొండ మీదకి వెళ్లారట. నేడు స్వామివారు దర్శనమిచ్చే గుహపైన వారికి ఒక మెరుపు లాగా కనిపించిందట. ఎండ తీవ్రతకు అలా అనిపించి ఉండవచ్చును అని అనుకొన్న అన్నదమ్ములు గ్రామానికి వెళ్లిపోయారట. నాటి రాత్రి స్వామి చిన్న రామన్నకు స్వప్న దర్శనం ఇచ్చి తాను కొండ మీద గుహలో ఉన్నాను, ఒక ఆలయం నిర్మించామని చెప్పారట. మరునాడు కొండను తొలుస్తూ గుహలోనికి వెళ్లగా రాతి మీద స్వామి వారి దివ్యమంగళ రూపం కనిపించిందట. సుమారు ఒక అడుగు మాత్రమే ఉన్న రూపంలో చిన్న కళ్ళు, నుదిటిన తిరునామం, రెండు చేతులలో శంఖు చక్రాలు, నాశిక, మీసాలు, చిన్న నోరు మరియు ఛాతి భాగం మాత్రమే ఉన్నాయట. తమ భాగ్యానికి సంతసించిన గ్రామస్థులు గుహ పైన చిన్న ఆలయాన్ని నిర్మించి పూజలు ఆరంభించారట. చిన్న రామన్నకు స్వామివారి రూపాన్ని పెద్దదిగా చేసి చూడాలి అన్న ఆశ కలిగిందట. శిల్పి వచ్చి వక్షస్థలం మీద ఉలిని తాకించగానే రక్తం వచ్చినదట. భయపడిపోయిన రామన్నకు స్వామి గాయం అయిన చోట శుద్ధమైన గంధాన్ని ఉంచమని చెప్పారట. నాటి నుండి నేటి వరకు స్వామివారి వక్షస్థలం మీద ప్రతి నిత్యం గంధాన్ని ఉంచుతారు. ఉదయం పాలాభిషేకం అనంతరం మంచి గంధపు ముద్దను శ్రీవారి వక్షస్థలం మీద అద్దుతారు మరునాడు అదే భక్తులకు ప్రసాదంగా ఇస్తారు.

అలా ప్రారంభమైన స్వామివారి సేవలు కొండవీటి రెడ్డిరాజుల కాలంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకొన్నాయట. ప్రస్తుతం ఉన్న ముఖ మండపం వారి కాలంలోనే నిర్మించబడినట్లుగా తెలుస్తోంది. తరువాత అమరావతి పాలకుడు శ్రీ రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కాలంలో మరింతగా ఆలయం అభివృద్ధి చెందినది అని చెబుతారు. సమీపంలోని హరిశ్చంద్రపురం ఒక బ్రాహ్మణుల ఇంట శ్రీఅలువేలుమంగ అమ్మవారి విగ్రహం ఉన్నది అని అశరీరవాణి చెప్పిన మీదట, తీసుకొని వచ్చి ఇక్కడ ప్రతిష్టించారు.

**ఆలయ విశేషాలు..** వైకుంఠ పురంలో ఎగువ మరియు దిగువ సన్నిధులు ఉంటాయి. ఎగువ సన్నిధి స్వామివారు స్వయంవ్యక్తగా కొలువు తీరినది. దిగువ సన్నిధి అనంతరకాలంలో నిర్మించినది.

**ఎగువ సన్నిధి** క్రౌంచగిరి మీద చిన్న కొండగుహలో శ్రీవారు కొలువు తీరిన ఆలయం. సహజంగా శ్రీ నరసింహస్వామి కొండగుహలలో కొలువు తీరి దర్శనం అనుగ్రహిస్తుంటారు.

కానీ కృష్ణాతీరంలో కనపడే మూడు ఆలయాలలో వైకుంఠ నాథుడు గుహలలో వ్యక్తమైనారు. క్రౌంచగిరి మీదకు చేరుకోడానికి సోపాన మార్గం ఏనాడో నిర్మించారు. ప్రస్తుతం రహదారి మార్గం కూడా నిర్మాణంలో ఉన్నది. మెట్ల మార్గంలో పైకి వెళ్లే దారిలో దశావతార మండపం, ఎగువన శ్రీ హనుమంతుడు మరియు శ్రీ గరుత్మంతుడు సన్నిధులు కనపడతాయి. కొండ మీదకి చేరుకోగానే ఎదురుగా ఎత్తైన ధ్వజస్థంభం, అమ్మవారి సన్నిధి, రెడ్డిరాజులు నిర్మించిన ముఖమండపం కనిపిస్తాయి. ముఖమండపం నుండి గర్భాలయానికి ప్రదక్షిణ చేయడానికి వీలు లేనందున గుహ పైన నిర్మించిన విమాన గోపురం వెనుక నుండి కొండ మీదగా ప్రత్యేకంగా ప్రదక్షిణాపథాన్ని ఏర్పాటు చేశారు. ప్రదక్షిణ పూర్తి చేసుకొని క్రిందికి వచ్చి ముఖమండపంలోనికి ప్రవేశిస్తే అక్కడ ఆళ్వార్ సన్నిధి, పెద్ద రోలు మరియు పొత్రం కనిపిస్తాయి. మన వేదనలను తొలగించే రోలులో కొబ్బరి వేసి పొత్రంతో రుబ్బి, ప్రదక్షిణ చేయాలి. ఇలా చేయడం వలన మన ఇహలోక బాధలు తొలగిపోతాయన్నది తరతరాల భక్తుల నమ్మకంగా చెబుతారు. ముఖ మండపాన్ని అనుసంధానంగా గర్భగుహ చేరుకోడానికి చిన్న మార్గం ఉంటుంది. అర్చకస్వామితో పాటు ఆరుమంది భక్తులు మాత్రమే ఒకసారి స్వామివారి దర్శనానికి వెళ్ళగలరు. గుహలో శ్రీవారు ఎత్తైన పీఠం మీద సుందర అలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిస్తారు. ముందు చెప్పినట్లుగా స్వామి వారి రూపం ఒక అడుగుకన్నా చిన్నగా వక్షస్థలం, హస్తాలలో శంఖుచక్రాలు, నుదిటిన తిరునామం, భక్తుల పాపాలను కాల్చివేసే నేత్రాలు, నాసిక, మీసం అంతే! వక్షస్థలం మీద ఏనాడో ఉలి గేటుకు అయిన గాయం మీద పెట్టిన గంధం. అదే భక్తులకు ప్రసాదం. వ్యాధులను నివారించే అద్భుతశక్తి ఈ గంధానికి ఉన్నదని విశ్వసిస్తారు భక్తులు. నిత్యం ఉదయం ఆరు నుండి సాయంత్రం ఆరు వరకు తెరిచి ఉంటుంది. సాయంత్రం ఎలాంటి పూజలు జరగవు. సంధ్యాసమయం నుండి దేవతలు, మహర్షులు శ్రీవారిని సేవించుకోడానికి వస్తారని చెబుతారు.



**దిగువ సన్నిధి** పర్వత పాదాల వద్ద విశాల ప్రాంగణంలో ఉండే ఈ ఆలయాన్ని అమరావతి పాలకులైన శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు గారు సుమారు మూడువందల సంవత్సరాల క్రిందట నిర్మించారని శాసనాధారాలు తెలుపు తున్నాయి. నేటి గుంటూరు, కృష్ణా జిల్లాలలో, కృష్ణాతీరంలో అనేక ఆలయాలు శ్రీ వేంకటాద్రినాయుడు నేతృత్వంలో నిర్మించబడినట్లుగా తెలుస్తోంది. ఎగువ సన్నిధికి వెళ్ళడానికి వృద్ధులు, స్త్రీలు, పిల్లలు, దేవాంగులు ఇబ్బందులు పడుతు న్నందున రాజావారు దిగువ సన్నిధి నిర్మించినట్లుగా తెలుస్తోంది. తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయానికి మూడంతస్థుల రాజగోపురం నిర్మించబడినది. దక్షిణం వైపున కూడా ఒక గోపురం ఉంటుంది. ఎత్తైన ధ్వజస్థంభం వద్ద శ్రీ గరుత్మంతుని సన్నిధి కనపడుతుంది. ముఖమండపానికి అనుసంధానంగా మూడు సన్నిధులు కనిపిస్తాయి. ముఖమండపంలో శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు విగ్రహం ముకుళిత హస్తాలతో ఉంటుంది. వీరి వంశం వారే ఆలయానికి నేటికీ ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు. గర్భాలయంలో నిలువెత్తురూపంలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడు దివ్యమంగళ అలంకరణలో నయనమనోహరంగా దర్శనమిస్తారు. ఇరుపక్కలా ఉన్న సన్నిధులలో దేవేరులు కొలువై ఉంటారు.ఎగువ సన్నిధిలో జరిగే అన్ని పూజలు, ఉత్సవాలు దిగువ సన్నిధిలో కూడా అంతే ఘనంగా నిర్వహిస్తారు. మరో రెండు విశేషాలు ఈ క్షేత్రంలో కనపడతాయి. ఒకటి పర్వతానికి ఎనిమిది దిక్కులా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయ స్వామి సన్నిధులు కనపడతాయి. కాకపోతే ఈ ఆలయాలకు ఒక వరుసలో వెళ్లడం కుదరదు. ప్రస్తుతం ఈ అష్ట ఆంజనేయ సన్నిధులకు వెళ్ళడానికి మార్గం వేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**అన్నాచెల్లెళ్ల గుహ..** దిగువ సన్నిధికి సమీపంలో కొండ మీద ఒక గుహ కనపడుతుంది. అన్నాచెల్లెళ్ల గుహ అని పిలుస్తారు. దేవదేవుని అనుగ్రహం మరియు ఆయన స్వయం వ్యక్తగా కొలువైన క్షేత్ర మహత్యాన్ని తెలిపే ఒక గాథ ఒకటి వినపడుతుంది. కృష్ణా తీరంలో ఒక గ్రామంలో ఒక దంపతులకు జన్మించిన అన్నాచెల్లెళ్ల చిన్నతనంలో విడిపోయారట. వేరువేరు ప్రాంతాలలో వేరువేరు తల్లితండ్రుల వద్ద పెరిగారట యుక్తవయస్సుకు వచ్చిన తరువాత అసలు విషయం తెలియని పెంపుడు తల్లితండ్రులు అన్నీ బాగున్నాయి అని వీరిరువురికీ వివాహం చేశారట. వివాహ సమయంలో ఆకాశవాణి అసలు విషయాన్ని వెల్లడించిందట. నిర్ఘాంతపోయిన పెద్దలు పండితులను సంప్రదించారట. జ్యోతిష్కులు, పండితులు విషయాన్ని అన్ని విధాలుగా విచారించి ఒక నిర్ణయాన్ని వెలిబుచ్చారు. జరిగిపోయినదానిని సరిదిద్దలేము. కానీ దోషపరిహారం ఉన్నది అని తెలిపారట. ఆ ప్రకారం వారికీ నల్ల బట్టలు తొడిగి, పాదాలకు బంధం వేసి కృష్ణానదీ తీరంలోని పుణ్య తీర్థ క్షేత్రాలలో స్నానం కొలువైన పరమాత్మను సేవించాలి. ఎక్కడ పాదాలకు వేసిన బంధం దానంతట విడిపోతుందో, ఎక్కడ వారి నల్ల వస్త్రాలు తెల్లగా మారుతాయో అక్కడ వారికి తెలియకచేసిన తప్పు తొలగి పోయినట్లు అని చెప్పి పంపారట. అన్నాచెల్లెళ్ల తమకు కలిగిన దురవస్థను చింతిస్తూ భారం భగవంతుని మీద వేసి నెమ్మదిగా ఒక్కో క్షేత్రం సందర్శించుకొంటూ చివరికి వైకుంఠ పురం చేరుకొన్నారట. ఇక్కడి ఉత్తరవాహినిలో స్నానం చేయగానే వారి బంధం విడిపోవడమే కాకుండా నల్లబట్టలు తెల్లగా మారిపోయి నాయట. ఆలయం లోనికి ప్రవేశించగానే వారు శ్రీవారిలో ఐక్యం అయ్యారట. కొండ మీద ఉన్న గుహలో అన్నాచెల్లెళ్ల విగ్రహాలను నేటికీ చూడవచ్చును. కానీ గుహను చేరుకోవడం కష్టతరమైన పని. వైకుంఠ పురం విజయవాడ, గుంటూరు, అమరావతి (పంచారామక్షేత్రం) నుండి సులభంగా రహదారి మార్గంలో చేరుకోవచ్చును. బస్సు సౌకర్యం కూడా లభిస్తుంది. వసతి సౌకర్యాలు గుంటూరు, విజయవాడ లేదా అమరావతిలో లభిస్తాయి. వైకుంఠ పురం దిగువ సన్నిధి వద్ద ఉన్న ఆశ్రమంలో చక్కని భోజనం లభిస్తుంది. తుళ్లూరుకు చెందిన శ్రీ అయ్యప్ప స్వామి భక్తులు ఈ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు.

"నమో వెంకటేశాయ "

పర్యాటకం



విశాఖపట్నం వచ్చిన పర్యాటకులు వేల సంవత్సరాల చారిత్రక కాలంలోకి వెళ్ళాలంటే తొట్లకొండలోని ప్రాచీన బౌద్ధారామాన్ని సందర్శించాల్సిందే. విశాఖపట్నం పేరు చెప్పగానే బీచ్‌లు, ఉక్కు కర్మాగారం, ఓడరేవు ఇత్యాదివి గుర్తుకు వస్తాయి. వీటితో పాటు ఇక్కడ వేలాది సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రాచీన బౌద్ధ క్షేత్రాలు ఉన్నాయి. వాటిలో బంగాళాఖాతం తీర ప్రాంతంలో ఉన్న 'తొట్లకొండ' బౌద్ధారామం అతి ముఖ్యమైనది. ఈ కొండపై రాతి నీటి తొట్టెలు ఉండటంతో దీనికి తొట్లకొండ అనే పేరు వచ్చింది. ఇక్కడ తొట్లకొండతో కలిపి మొత్తం ఎనిమిది కొండలు ఒకే వరుసలో ఉంటాయి.

# సాక్షీభూతాలు తొట్లకొండ చైత్రాలు

**షేక్ అబ్దుల్ హకీం జాని**

విశాఖపట్నానికి 16 కి.మీ. దూరాన ఉన్న తొట్లకొండలో రెండువేల సంవత్సరాలనాటి ప్రాచీన బౌద్ధక్షేత్రం పర్యాటకుల్ని కనువిందు చేస్తున్నాయి. భీమిలి పట్టణానికి వెళ్లే మార్గంలో సముద్ర మట్టానికి 128 మీటర్ల ఎత్తులో ఉన్న కొండపైన తొట్లకొండ సుందరమైన ప్రదేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బౌద్ధ మత వైభవ ప్రాభవానికి ఈ ప్రాంతం అద్దం పడుతుంది. బంగాళాఖాతం సముద్రతీరానికి అభిముఖంగా 128 మీటర్ల ఎత్తైన తొట్లకొండపై ఈ ప్రాచీన బౌద్ధ క్షేత్రం ఉంది.



**రాతితొట్టెలు** ఈ కొండపై రాతిని తొలిచి నిర్మించిన అనేక నీటి తొట్టెలు ఉండడం వలన దీనిని తొట్లకొండగా పిలుస్తారు. బౌద్ధ భిక్షువులు తమ నీటి అవసరాల కోసం రాతిని తొలిచి అప్పట్లో ఇక్కడ 11 నీటి తొట్టెలను నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. అవి ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ఏ కాలమైనా నీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా, నీరు నిల్వ ఉండే విధంగా ప్రత్యేక శైలిలో వీటిని తీర్చిదిద్దారు. ఈ రాతి తొట్టెలు రెండు రకాలు. ఒకటి తాగునీటి అవసరాలకు ఉపయోగించేవి. రెండు దీవరాలకు (భిక్షువులు ధరించే పై వస్త్రం) రంగు అద్దుకోవడానికి రంగు నీటిని నిల్వ చేసే తొట్టెలు. అలాగే తొట్లకొండపైన ఉన్న మహా స్తూపంపై తెల్లని సున్నం అద్దేవారు. రాత్రిపూట దానిపై దీపాలను అలంకరించేవారు. అప్పట్లో దీపాలతో వెలుగుతున్న ఈ స్తూపమే రాత్రిళ్లు కొండపైకి ఎక్కే భిక్షువులకు, నావికులకు లైట్ హౌస్ పని చేసేది అనడానికి ఆధారాలున్నాయని పరిశోధకుల అభిప్రాయం. క్రీస్తుపూర్వం 200 నుంచి 300 శతాబ్దం మధ్య ఈ ప్రదేశం ఓ వెలుగు వెలిగినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

1976లో విశాఖపట్నంలో నావికాదళం నిర్మాణాల కోసం సాగరతీరంలో అనువైన ప్రదేశాల కోసం వైమానిక సర్వే నిర్వహిస్తుండగా కాకతాళీయంగా ఈ ప్రదేశం బయట పడింది. దీంతో పురాతత్వ పరిశోధకులు ఇక్కడ తవ్వకాలు జరపగా ఎంతో విశిష్టమైన చారిత్రక నిర్మాణాలు వెలుగు చూశాయి. 1978లో తొట్లకొండను పురాతన, రక్షిత ప్రాంతంగా గుర్తించారు. 1988 నుంచి 1992 మధ్య ఇక్కడ రాష్ట్ర పురాతత్వ పరిశోధన శాఖ తవ్వకాలు విస్తృతంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ జరిపిన తవ్వకాలలో 120 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఒక సముదాయం బయటపడింది. హీనయాన బౌద్ధశాఖకు చెందిన థేరవాద బౌద్ధక్షేత్రం ఈ ప్రదేశంలో ఉండేదని పురాతత్వ శాఖ వారు నిర్ధారించారు. ఆ తర్వాత పురావస్తు శాఖ జరిపిన తవ్వకాలలో ఈ నిర్మాణాలు క్రీస్తు పూర్వం రెండో శతాబ్దానికి ముందు బౌద్ధ భిక్షువులు నివసించిన ఆవాసాలుగా నిర్ధారించారు. బౌద్ధుల కోసం నీటిని సేకరించే రాతి బావుల కారణంగా సాహిత్యపరంగా "రాతి బావులు ఉన్న కొండ" అని అర్థం. తొట్లకొండ కాంప్లెక్స్ అద్భుతమైన నిర్మాణ రూపకల్పనతో బౌద్ధ సన్యాసులకు శాంతి, సామరస్యాన్ని అందించడానికి నిర్మించి ధ్యాన మందిరాలతో అందంగా ఉంది. చైనా, బర్మా ఇత్యాది అనేక ఇతర దేశాల నుండి ఇక్కడకు వచ్చిన బౌద్ధ సన్యాసులు తమ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి నెలల తరబడి ఈ ప్రదేశంలో ఉండేవారు. ఇక్కడ జరిగిన తవ్వకాల్లో రోమన్లు, శాతవాహనుల కాలాల నాటి వెండి నాణేలు, బ్రాహ్మిలిపిలో ఉన్న శాసనాలు లభించాయి.

**పురావస్తు భాండాగారం**

ఇక్కడ పురావస్తు శాఖవారు జరిపిన త్రవ్వకాలలో రాతి స్తంభాల సభామండపం, మహాస్తూపం, రాతిలో తొలచిన నీటితొట్టెలు, విహారాలు, చైత్యగృహాలు, భోజనశాల ఇత్యాది

అనేక పురాతన కట్టడాలెన్నో వెలుగు చూశాయి. ఇవి కాక దీక్షాఫల సిద్ధికి చిహ్నంగా కొన్ని ఉద్దేశిక స్తూపాలు, వేదికలు ఇక్కడి త్రవ్వకాలలో బయల్పడినాయి. ఈ బౌద్ధ ఆశ్రమంలో చక్కగా తీర్చిదిద్దిన రాతి మార్గాలు ఉండేవని తెలుస్తోంది. నున్నగా చెక్కిన రాష్ట్ర, బ్రాహ్మిలిపిలో కల ఛత్రఫలకములు, శాతవాహన కాలమునాటి నాణేలు, రోమనుల వెండి నాణేలు, మృణ్మయ శకలాలు, సున్నంతో పోతపోసిన అలంకరణ సామాగ్రి ముక్కలు, శిల్ప ఫలకాలు, రాతిలో మలచిన నమూనా స్తూపాలు, అష్టమంగళ చిహ్నాలు గల బుద్ధుని పాదాలు, ప్రాచీన చరిత్ర కలిగిన మృణ్మయ పాత్రలు ఇత్యాదివి ఇక్కడి త్రవ్వకాలలో బయల్పడినాయి. ఈ కొండపై బౌద్ధ భిక్షువుల చైతన్య గృహాలు, ఆరామాలు, విహారాలు, మహా స్థూపం, ఇతర నిర్మాణాలు ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ 1988 నుండి 1993 వరకు భారీస్థాయిలో త్రవ్వకాలను నిర్వహించగా ఆశ్చర్యకరమైన అంశాలు బయల్పడినాయి. ఈ త్రవ్వకాలలో రోమన్ సామ్రాజ్యానికి చెందిన వెండి నాణేలు, శాతవాహన రాజవంశం కాలంనాటి సీసపు నాణేలు కనుగొన్నారు. టెర్రకోట టైల్స్, కుండలు, అలంకరణ ముక్కలు, రాతి, ఇతర పురావస్తు కళాఖండాలలో సూక్ష్మస్తూపం నమూనాలు కనుగొన్నారు. బ్రాహ్మీ, పాళీ లిపిలో రాతిపై చెక్కిన దాదాపు పన్నెండు శాసనాలను కూడా కనుగొన్నారు. బావికొండ త్రవ్వకాల్లో బొగ్గుతో పాటు మానవ ఎముకల అవశేషాలతో బంగారు పేటికలు బయటపడ్డాయి. ఇవన్నీ నాటి బౌద్ధులకు చెందినవి అని తేల్చి చెప్పారు. అవి ప్రస్తుతం హైదరాబాద్ మ్యూజియంలో ఉన్నాయని, రాష్ట్ర విభజన తర్వాత వాటిని ఏపికి తిరిగి ఇవ్వాలనే డిమాండ్ కూడా తెరపైకి వచ్చింది. పావురాళ్లకొండ, పంచదార్ల తవ్వకాలు ఇంకా పూర్తి కానప్పటికీ, తొట్లకొండ, బావికొండలలో 'మహా స్తూపం', 'పరభోగిక స్తూపం', 'వోటివ్ స్తూపాలు' వంటి మూడు రకాల 'స్తూపాలు' కనుగొన్నారు. తొట్లకొండలో 'స్తూపాలు', 'విహారాలు' కాకుండా, దాదాపు 64 స్తంభాలతో ఒక పెద్ద సభా మందిరం ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి.

**సజీవ సాక్ష్యం** ఇక్కడ త్రవ్వకాలలో బయటపడిన అనేక చారిత్రక నిర్మాణాలు నేటికీ సజీవ సాక్ష్యంగా నిలిచి నాటి బౌద్ధ చరిత్రను కళ్ళకు కట్టినట్లు చూపుతున్నాయి. రాతి నీళ్ళతొట్టి, ఉద్దేశిక స్థూపాలు, మహాస్తూపం, విహారాలు, ప్రధాన బౌద్ధభిక్షు గది, గజ పుష్పాకార చైత్య గృహము, సమావేశ మందిరం, భాండాగారంగా పిలిచే గిడ్డంగి, కపియభూమిగా పిలుచుకునే వంటగది, ఉపాతనశాలగా వ్యవహరించే భోజనశాల, అర్ధవృత్తాకార చైత్య గృహము, బుద్ధపాద వేదికలు ఇత్యాదివి ఎన్నో పర్యాటకుల్ని కనువిందు చేస్తూ



నాటి బౌద్ధ జ్ఞానాన్ని ప్రసాదిస్తున్నాయి. ఇక్కడ నిర్మాణాలన్నింటినీ కూడా ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇటుకలకు మూడింతలు పెద్దవిగా ఉన్న ఇటుకలతో కట్టారు. ఆ ఇటుకలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. కొన్ని అసాంఘిక శక్తులు కొన్ని నిర్మాణాలను ధ్వంసం చేశాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా మరికొన్ని కూలిపోయాయి. ఎంతో ఘన చరిత్ర ఉన్న తొట్లకొండలాంటి పురాతన కట్టడాలే మన చరిత్రను భవిష్యత్తు తరాలకు చెబుతాయి. మనం భావి తరాలకు అందించగలిగే అపురూప సంపద అదే అని అందరూ గుర్తించాలి. తొట్లకొండ అనేది చారిత్రక ప్రాముఖ్యత కలిగిన పురాతన బౌద్ధ స్థూపాలు, విహారాలు (మఠాలు), చైత్యాలు (ప్రార్థనా మందిరాలు) అవశేషాలతో కూడిన ఒక ముఖ్యమైన పురావస్తు ప్రదేశం. ఇది ఈ ప్రాంత బౌద్ధ వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. స్తూపాలు అంటే బౌద్ధ స్మారక చిహ్నాలు, సాధారణంగా బుద్ధుడు, ఇతర బౌద్ధ సాధువులకు సంబంధించిన పవిత్ర అవశేషాలను కలిగి ఉంటాయి. చైత్యం అనేది మధ్యలో ఉంచబడిన స్తూపం, లోపల ఉన్న దీర్ఘచతురస్రాకార ప్రార్ధన మందిరం. దీని ఉద్దేశ్యం ప్రార్థన. విహారాలు అంటే బౌద్ధ సన్యాసుల నివాసాలు, ఈ చుట్టుపక్కల ప్రాంతం వైవిధ్యమైన వృక్షజాలం, జంతుజాలానికి నిలయం. ఈ ప్రాంతం ప్రకృతి ఆలవాలం, పక్షులను నిలయంగా చెప్పవచ్చు. తోట్లకొండ పరిసరాల్లో ప్రశాంతమైన వాతావరణం నగర జీవితంలోని హడావిడి దూరంగా ఉండి ప్రశాంతత చేకూరుస్తుంది. పర్యాటకులు ఈ ప్రాంత చరిత్ర, ప్రాముఖ్యత, పురాతన బౌద్ధ సంప్రదాయాలను తెలుసుకోవచ్చు. తోట్లకొండ సందర్శించడానికి ఉత్తమ సమయం నవంబర్ నుండి ఫిబ్రవరి వరకు ఉండే శీతాకాలం. ఆ సమయంలో వాతావరణం చల్లగా ఉండటంతో ఈ ప్రదేశాన్ని అన్వేషించడానికి మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ప్రకృతి దృశ్యాలను ఆస్వాదించడానికి ఈ ప్రాంతం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. తొట్లకొండ బౌద్ధక్షేత్రం గురించి ఇంకా పరిశోధనలు జరగవలసి ఉంది. ఈ బౌద్ధారామాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తుశాఖ సంరక్షణలో ఉన్నాయి. ఇక్కడ ఉన్న ప్రతి నిర్మాణం, వస్తువులు చరిత్రకు సాక్షీ భూతాలు. కాబట్టి వీటిని ఎవరైనా హాని చేయడం, ఇక్కడి నుండి వేరే ప్రాంతాలకు తరలించడం వంటి పనులు చేస్తే శిక్షార్హులు. నేడు ప్రపంచంలోని అనేక దేశాలు తమ దేశంలోని ప్రాచీన బౌద్ధ మందిరాలను వారసత్వ సంపదగా భావించి పరిరక్షిస్తున్నారు. అదే విధంగా మన రాష్ట్రంలోని తొట్లకొండ బౌద్ధ క్షేత్రాన్ని పరిరక్షించి పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ భూములన్నీ ఆంధ్రప్రదేశ్ పురాతన, చారిత్రక కట్టడాలు, పురావస్తు చారిత్రక కట్టడాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం 1960 పరిధిలోకి వస్తాయి. వీటికి ఎటువంటి హాని చేసినా, ఆక్రమించుకున్నా శిక్షార్హులు.

# ఏప్రిల్ 20, 2025 నుండి ఏప్రిల్ 26, 2025 వరకు

## వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం



ఈ వారం రాజకీయ, కళారంగాల వారికి ఆకస్మిక విదేశీ పర్యటనలు వుంటాయి. గృహనిర్మాణాలు చేపట్టే అవకాశం వుంది. ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. నిత్యం అష్టగణపతి పీఠం నాకు పూజలు చేయటం వలన వాస్తు దోషాలు నశిస్తాయి. అనవసర వివాదాలు పోతాయి. కొత్త వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. శ్రమపడ్డా ఆశించిన ఫలితం అందుకుంటారు.

### వృషభం



ఈ వారం ఎదురు చూస్తున్న అవకాశాలు దగ్గరకు వస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. రాజకీయ, కళారంగాల వారికి జనాదరణ పొందుతారు. నిత్యం మేధాదక్షిణామూర్తి రూపు ధరించటం వలన విద్యాభివృద్ధి కలుగుతుంది. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కార మవుతాయి. వృధాఖర్చులు పెరుగుతాయి. మనశ్శాంతి లోపిస్తుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం.

### మిథునం



ఈ వారం సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతారు. నిత్యం హనుమాన్ వత్తులు అష్టమూలికా తైలంతో కలిపి దీపారాధన చేయటం వలన ఏ రకమైన దుష్టశక్తి మీ దరి చేరలేదు. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. మీలోని ప్రతిభకు తగిన పురస్కారాలు పొందుతారు.

### కర్కాటకం



ఈ వారం ఆర్థిక పరిస్థితిగతంలో కంటే మెరుగుపడుతుంది. కొన్ని రుణాలు తీరి ఊరట చెందుతారు. నూతన వస్తు, వస్త్రాలు లాభాలు పొందుతారు. కొత్త వ్యూహాలతో క్లిష్టమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నిత్యం యజ్ఞభస్మం ధరించటం వలన యజ్ఞం చేసిన ఫలితం లభిస్తుంది. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి దూరప్రయాణాలు కలసి వస్తాయి.

### సింహం



ఈ వారం సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. బాకీలు వసూలవుతాయి. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు. నిత్యం త్రిశూల్ పెట్టి పొగవేయటం వలన అనుకున్న పని అవుతుంది. నూతన కాంట్రాక్టులు దక్కుతాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

### కన్య



ఈ వారం రుణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. నూతన పెట్టుబడులు విషయంలో తొందరపాటు వద్దు. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. నిత్యం హనుమాన్ వత్తులు అష్టమూలికాతైలంతో దీపారాధన చేయండి. ప్రత్యర్థుల పట్ల అప్రమత్తంగా మెలగండి. దూరప్రాంతాల నుండి వచ్చిన వార్త ఆనందం కలుగుతుంది.

### తుల



ఈ వారం వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. ఆర్థిక, వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. నానారకాల అరిష్టాలు, ఇబ్బందులు, చికాకులు పోవడానికి, శత్రుబాధలు నశించడానికి త్రిశూల్ ఉపయోగించండి. నూతన ఉద్యోగయత్నాలు అనుకూలిస్తాయి. పారిశ్రామిక రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు.

### వృశ్చికం



ఈ వారం ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండటం అన్ని విధాలా మంచిది. అష్టమూలికా గుగ్గిలంతో, కప్పు సాంబ్రాణితో మీ ఇంట్లోనూ, వ్యాపార ప్రదేశాలలోను ధూపం వేయటం వలన ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుంది. ఆరోగ్యం, వాహనాల విషయంలో నిర్లక్ష్యం తప్పదు. కాంట్రాక్టులు దక్కుతాయి. నూతన విద్యలపై ఆసక్తి చూపుతారు.

### ధనస్సు



ఈ వారం సంతానం నుండి ధనలాభం పొందుతారు. లక్ష్మీతామర వత్తులతో అష్టమూలికా తైలం కలిపి దీపారాధన చేయటం వలన లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుంది. ఋణబాధలు నుండి విముక్తులవుతారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవం పొందుతారు. ఇంటా బయటా అనుకూలంగా ఉంటుంది. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

### మకరం



ఈ వారం గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. మీ ప్రతిభకు తగిన గుర్తింపు పొందుతారు. సర్పదోష నివారణ చూర్ణముతో సర్వరక్షాచూర్ణము కలిపి స్నానం చేయటం వలన సర్వదోషాలు తొలుగుతాయి. ఆర్థికాభివృద్ధి కొరకు లక్ష్మీకటాక్షాన్ని ఉపయోగించండి. ఇది చాలా మంచిది.

### కుంభం





ఈ వారం ఇతరుల విషయాలలో జోక్యం తగదు. నూతన వస్త్రాలు, వస్తువులు కొనుగోలు చేస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. పూజలలో సిద్ధగంధాన్ని ఉపయోగించండి. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్న అవసరాలకు డబ్బు అందుతుంది. దీర్ఘకాలిక రుణాలు ఎదురై చికాకులు పెడతాయి.


### మీనం



ఈ వారం ఎంత కష్టపడినా ఫలితం దక్కదు. ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. నిత్యం లక్ష్మీదేవికి సుగంధ సిద్ధ గంధాక్షితలతో పూజ చేయటం వలన మేలు జరుగుతుంది. భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ అవసరం.


ఆక్కల్లో గ్రూప్ వన్ ఉద్యోగం ఇంకెన్ని రోజులు.? వచ్చేయి బావా 'రీల్స్' చేసుకుందాం..!!


అసలే మేం ట్యాంకర్లతో నీళ్లు కొంటున్నాం..! మీరంతా నీళ్లు లేకుండా బతకడం నేర్చుకోండి!!


... తెలియక కాదు.. మన రీల్స్ కు 'బూతు' కామెంట్స్ పెట్టడానికే కొన్ని వేలమంది 'ఎదవలు' మన రీల్స్ చూస్తారు.. మనకు 'వ్యూస్' పెరుగుతాయి..!!
- "రీల్స్" మీటింగ్ -

కార్టూన్ కా'ర్టూన్'













శ్రీలంకలోని కొలంబోలో వున్న ఎత్తయిన లోటస్ టవర్‌కు సంబంధించిన చిత్రాలివి. సుమారు పన్నెండు వందల అడుగుల ఎత్తయిన ఈ టవర్‌లో కింద మ్యూజియం, పైన పద్మంలో రెస్టారెంట్లు ఉన్నాయి.



